S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక | తెలుగు దినపత్రిక



సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



సంపుటి: 19 | సంచిక: 50 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 29 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |


## సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నాం




జనవరి 1న ఆయుధాలు వదిలేస్తాం ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖ

02



## ప్రపంచంలోనే ఎత్తయిన రాముడి విగ్రహం


గోవాలో 77 అడుగుల స్టాచ్యూ ఆవిష్కరించిన ప్రధాని మోదీ

04

ప్రపంచంలోనే ఎత్తైన రామ విగ్రహాన్ని ఆవిష్కరణ కార్యక్రమం దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగింది. శుక్రవారం గోవాలో పర్యటించిన ఆయన.. సౌత్ గోవా కానాకోనలోని గోకర్ణ జీవోత్తం మఠంలో ఏర్పాటు చేసిన 77 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. మఠం 550 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుక కార్యక్రమం జరగడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రధాని మఠాన్ని సందర్శించి, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



## లక్ష కంఠ భగవద్గీత పఠనంలో మోడీ



## అయ్యప్ప భక్తులకు శుభవార్త

ఇరుముడితో ప్రయాణానికి ఎయిర్‌పోర్ట్ అథారిటీ అనుమతి

.. వివరాలు 4లో



## ఢిల్లీ కాలుష్యంపై ప్రణాళిక ఏదీ

మోడీపై మరోమారు రాహుల్ విమర్శలు పార్లమెంటులో చర్చిస్తామని వెల్లడి

.. వివరాలు 4లో



## ఢిల్లీ పేలుడు కేసులో ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం

అల్-ఫలా విశ్వవిద్యాలయానికి షాహీన్ సీన్ రిక్రియేషన్‌తో మూలాలు గుర్తించే యత్నం

.. వివరాలు 4లో



## మోడీ అండతో

# అమరావతి పునర్నిర్మాణం

## ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పనితీరు అద్భుతం

గత పాలకుల విధ్వంసంతో ఆగిపోయిన రాజధాని

బ్యాంకింగ్ రంగ సంస్థల రాకతో ఆర్థిక పరిపుష్టి

వేలాదిమందికి ఉద్యోగావకాశాలకు ఆస్కారం

రాయలసీమకు వృధాజలాలలు తరలిస్తాం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి



**అమరావతి :** గత పాలకుల విధ్వంసంతో ఆగిపోయిన అమరావతి రాజధాని పనుల్ని ప్రధాని మోదీ పునఃప్రారంభించారని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాలను త్యాగం చేసిన రైతులకు ధన్యవాదాలు. ప్రపంచంలో స్ఫూర్తిదాయకమైన ల్యాండ్ పూలింగ్ విధానంలో భూముల పొందిన ప్రాంతం అమరావతి అని గుర్తు చేశారు. రూ.15 వేల కోట్లను రాజధాని

మిగతా 5 లో

## అప్పుల భారం తగ్గింపు, గూగుల్ ప్రాజెక్టుపై కీలక నిర్ణయాలు

- అధిక వడ్డీ అప్పులను తక్కువ వడ్డీ రుణాలతో మార్చేందుకు సీఎం ఆదేశం
- ప్రభుత్వ, కేంద్ర సంస్థలకు ఫైర్ ఎన్‌ఓసీ రుసుము నుంచి మినహాయింపు
- గూగుల్ డేటా సెంటర్ నిర్మాణంలో ఆరు భాగస్వామ్య కంపెనీలకు ఆమోదం
- రాష్ట్ర క్రెడిట్ రేటింగ్ మెరుగుపడటంతో అప్పుల భారం తగ్గించుకునేందుకు చర్యలు
- గూగుల్‌తో కుదిరిన అసలు ఒప్పందంలో మార్పులు ఉండవని కేబినెట్ స్పష్టం

5

## అమరావతి నిర్మాణం అంటే ఒక యజ్ఞం



అమరావతి పునర్నిర్మాణం సంతోషదాయకం

రాజధాని నిర్మించడం మూమాలు విషయం కాదు

రాజధానిలో బ్యాంకులన్నీ ఒకేచోటకు రావడం సంతోషం

రైతులకు అండగా కార్యకలాపాలు సాగాలని ఆర్థిక మంత్రి ఆకాంక్ష

అమరావతిలో పుల బ్యాంకులకు నిర్మలాసీతారామన్ శంకుస్థాపన

5

## పంచాయితీ ఎన్నికలకు లైన్ క్లియర్

ఈ దశలో స్టే విధించలేమని స్పష్టీకరణ




తామే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించి.. స్టే ఎలా విధిస్తాం

పిటిషనర్‌ను ప్రశ్నించిన ధర్మాసనం

జీవో 46పై హైకోర్టు స్పష్టత

తెలంగాణ పంచాయతీ ఎన్నికలపై అడ్డంకి తొలగింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై జారీ చేసిన జీవో 46 ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హై కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికలపై స్టే విధించలేమని హైకోర్టు తెలిపింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని చెప్పింది. తామే ఎలక్షన్స్ నిర్వహించాలని ఆదేశించి..తామే ఎలా స్టే ఇవ్వగలమని పిటిషనర్ కు సూచించిం ది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

2

## కామారెడ్డిలో కవిత రైలురోకో

- కార్యకర్తలకు, పోలీసుల మధ్య తోపులాట
- కవిత చేతికి స్వల్ప గాయం
- అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలింపు
- బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు డిమాండ్

3



# ఎకరం 151 కోట్లు

కోకాపేటలో భూములకు రికార్డు రేటు

నియోపోలీస్ ప్లాట్ల వేలంలో రికార్డుస్థాయి ధరలు

2







## సీఎం సొంతూరులో సర్పంచ్ ఏకగ్రీవం

కాంగ్రెస్ ఖాతా తెరిచిన రేవంత్ రెడ్డి

సర్పంచ్ పదవికి పోటీ పడిన 15 మంది

కొండారెడ్డిపల్లిలో ఎస్సీకి సర్పంచ్ రిజర్వేషన్

2

## 1 నుంచి రేవంత్ జిల్లాల పర్యటన

2

## సర్పంచ్ పదవికి వేలం

2



- జోగుగూడెంలో 20లక్షలకు దక్కించుకున్న వ్యక్తి
- ఆంజనేయ ఆలయానికి వినియోగిస్తామని వెల్లడి

4



## వేగంగా కదులుతున్న దిత్వా తుఫాన్

తమిళనాడులో భారీ వర్షాలు కురిసే ఛాన్స్

డిసెంబర్ 1న ఆంధ్రప్రదేశ్‌కు..




# సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నాం

## జనవరి 1న ఆయుధాలు వదిలేస్తాం

## ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖ

**రాయపూర్, నవంబర్ 28:** మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర-మధ్యప్రదేశ్- ఛత్తీస్‌గఢ్ ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖను విడుదల చేశారు. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు. ఒక్కొక్కరు బదులుగా అందరం ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు. మిగతావారు లొంగిపోవాలన్న కేంద్రం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమించుకుంటామన్నారు. ఆయుధాలు అప్పగించి ప్రభుత్వ పునరావాసాన్ని అంగీకరిస్తామని చెప్పారు. తమకు సహకరించే రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధమని పేర్కొన్నారు. అందరూ లొంగిపోయే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని కోరారు. జనజీవన స్రవంతిలో కలిసేందుకు తమకు కొంత సమయం కావాలని గతవారం మావోయిస్టులు లేఖ రాసిన సంగతి తెలిసిందే.

# అధికారాలను హరించేదిగా కేంద్ర విత్తన బిల్లు

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, నవంబర్ 28:** రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు ఉందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. కేందప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన ముసాయిదా బిల్లుపై మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు.. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో సెంట్రల్ డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు-2025 రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. విత్తన ముసాయిదా బిల్లుపై సర్టిఫికేషన్ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలను నియంత్రించాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విత్తన ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంపాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. జిల్లాల వారీగా రైతు సమావేశాలు నిర్వహించి సంబంధిత అధికారులు అభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశించారు. పంట నష్ట పరిహారం విషయంలో విత్తన ముసాయిదా బిల్లులో స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన కేంద్ర ముసాయిదా విత్తన బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు గట్టిగానే తెలుపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

# సర్పంచ్ పదవికి వేలం

## జోగుగూడెంలో 20లక్షలకు దక్కించుకున్న వ్యక్తి

## ఆంజనేయ ఆలయానికి వినియోగిస్తామని వెల్లడి

**ఖమ్మం, నవంబర్ 28:** తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సర్పంచి పదవి దక్కించుకోవడం కోసం పలువురు నేతలు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. పలుచోట్ల వేలం పాటలు సాగుతున్నాయి. గ్రామపంచాయితీ అభివృద్ధి కోసం అంటూ గ్రామ పెద్దలు ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ క్రమంలోనే పలు చోట్ల ఆ పదవిని బహిరంగ వేలం వేస్తున్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం జోగుగూడెం పంచాయతీ సర్పంచి పదవికి బహిరంగ వేలం వేశారు. వేలంలో ఏడుగురు అభ్యర్థులు పోటీపడగా.. వారిలో అత్యధికంగా ఒకరు రూ.20లక్షలకు సర్పంచి పదవిని దక్కించుకున్నారు. గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి వేలంలో వచ్చిన నగదు ఖర్చు చేయనున్నట్టు గ్రామస్థులు తెలిపారు. పూర్తిగా గిరిజన గ్రామమైన జోగుగూడెంలో 1350 మంది జనాభా ఉండగా. 800 మంది ఓటర్లు ఉన్నారు. రెండో దశలో ఈగ్రామంలో పోలింగ్ జరగనుంది. ఈ నెల 30 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. సర్పంచ్ పదవికి వేలం పాట అనంతరం గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు.

# పంచాయితీ ఎన్నికలపై సీఎం ఫోకస్

## 1 నుంచి రేవంత్ జిల్లాల పర్యటన



**హైదరాబాద్, నవంబర్ 28:** పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో సిఎం మరోమారు జిల్లాల్లో పర్యటించి పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రచారం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. మొత్తం ఆరు రోజుల పాటు సీఎం జిల్లాల టూర్ కొనసాగనుంది. 6 రోజులు.. 6 జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటించనున్నారు. డిసెంబర్ 1న మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్, 2న ఖమ్మం జిల్లా కొత్తగూడెం, 3న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్, 4న ఆదిలాబాద్, 5న నర్సంపేట, 6న నల్గొండ జిల్లా దేవరకొండలో పర్యటించనున్నారు. తెలంగాణలో త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. మొదటి విడత వచ్చే నెల డిసెంబర్ 11, రెండో విడత డిసెంబర్ 14, మూడో విడత డిసెంబర్ 17న ఉంటుంది. అయితే, ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన చేపట్టనున్నారని తెలుస్తోంది. తాజాగా, సీఎం రేవంత్ జిల్లాల పర్యటన ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది.

# పంచాయితీ ఎన్నికలకు లైన్ క్లియర్

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. అందుకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. సబ్ కేటగిరి రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం హుకుం జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ గురువారం వెనుకబడిన కులసంఘాలు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాయి. అత్యంత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కేటాయించాలని పిటిషనర్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. బీసీలలో ఏబీసీడీ వర్గాల ఆధారంగా




రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఈక్రమంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఎన్నికల పక్రియ మొదలైనందున ఈ దశలో స్టే విధించలేమని తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎందుకు సవాల్ చేస్తున్నారని ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

# ఎకరం రూ.151 కోట్లు

## కోకాపేటలో భూములకు రికార్డు రేటు

## నియోపోలీస్ ప్లాట్ల వేలంలో రికార్డు ధరలు

**హైదరాబాద్, నవంబర్ 28:** భూమిలో బంగారం పండుతుందని అంటుంటారు. కానీ భూములు బంగారమయ్యాయని ఇప్పుడు నిరూపితం అయ్యింది. హైదరాబాద్‌లో భూముల విలువ బంగారాన్ని మించి పెరిగిపోయి రికార్డు సృష్టిస్తున్నాయి.కోకాపేట్ పరిసర ప్రాంతాల్లో కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఈ వేలంలో కోకాపేట నియోపోలీస్ భూములు రికార్డు స్థాయి ధర పలికాయి. రెండో విడత వేలంలో ఎకరాకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా.. 151 కోట్ల రూపాయలు పలికి హెచ్ఎండిఎకు కోట్లు కురిపించాయి. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేటలో భూములు.. కో అంటే కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో కోకాపేటలోని నియోపొలిస్ లేఅవుట్‌లో నిర్వహించిన ఈ-వేలంలో ఎకరం రూ.151.25 కోట్ల రికార్డు ధర పలికింది. నియోపోలిస్‌లోని ప్లాట్ నంబర్ 15, 16లోని 9.06 ఎకరాలను ప్రభుత్వం వేలం వేయగా.. రూ.1,353 కోట్లు ఆదాయం లభించింది. హైదరాబాద్ కోకాపేట్ లో ఉన్న భూముల రెండో విడత ఈ-వేలం శుక్రవారం ముగిసింది. నియోపోలిస్ దగ్గర ఉన్న ప్లాట్ నెంబర్ 15 లో ఎకరానికి 151 కోట్ల 25 లక్షలు పలికిన ఎకరం ధర పలికి రికార్డు సృష్టించింది. అదే విధంగా ప్లాట్ నెంబర్ 16 లో ఎకరం ధర 147 కోట్ల 75 లక్షలు పలికింది.రెండో విడత వేలంలో భాగంగా 9.06 ఎకరాల భూమిని వేలం వేసిన 1,3 కోట్ల 52 లక్షల ఆదాయాన్ని పొందింది. ప్లాట్ నెంబర్ 15 లో 4.03 ఎకరాలకు గాను 609 కోట్ల 55 లక్షలు పొందినట్లు ఊఓఅం అధికారులు తెలిపారు. అదే విధంగా ప్లాట్ నెంబర్ 16లో 5.03 ఎకరాలకు గాను 743 కోట్లు పొందినట్లు పేర్కొన్నారు. నవంబర్ 25న జరిగిన మొదటి విడత వేలంలో రికార్డు స్థాయిలో ఎకరానికి 137.25 కోట్లు పలికిన సంగతి తెలిసిందే.. కోకాపేట నియోపోలిస్ లో 29 ఎకరాలతో పాటు మూసాపేట దగ్గర ఉన్న 16 ఎకరాల భూములకు వేలం వేసేందుకు సిద్ధమైంది హెచ్ఎండీఏ.డిసెంబర్ 3, 5 తేదీల్లో మిగతా ఎ÷-లాట్లకు ఈ వేలం జరగనుంది. కోకాపేట్ నియోపోలీస్ ప్లాట్లకు ఎకరానికి 99 కోట్లు, కోకాపేట గోల్డెన్ మైల్ ప్లాట్లకు 70 కోట్లు, మూసాపేట్ ప్లాట్ల కు 75 కోట్ల చొప్పున ప్రారంభ ధరను నిర్ణయించింది హెచ్ఎండీఏ. కోకాపేటలోని నియోపోలిస్ లేఅవుట్‌లో ప్లాట్లను కొనుగోలు చేసే వారికి ఆకాశమే హద్దుగా ఎన్ని ఫ్లోర్లయినా నిర్మించుకునేందుకు అనుమతులు ఇస్తారు. ఈ లేఅవుట్‌లో అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు. దాదాపు 300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.40 ఎకరాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించారు. ఇందులో సైక్లింగ్ ట్రాక్స్, 45 మీ. వెడల్పైన రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలను కల్పించారు. అలాగే కమర్షియల్, రెసిడెన్సీ, ఎంటర్‌టైన్‌మెంట్‌ల అవసరాలకు భవనాలు నిర్మించుకునేందుకు అనుమతించనున్నారు.

# చిరంజీవి ట్రస్ట్‌కు విదేశీ విరాళాలు

## కేంద్రం అనుమతి లభ్యం




**హైదరాబాద్, నవంబర్ 28:** మెగాస్టార్ చిరంజీవి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు మరో అవకాశం చిక్కింది. సేవాగుణం నుంచే ఉద్భవించినదే 'చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ 27 ఏళ్లుగా బ్లడ్ అండ్ ఐ బ్యాంక్ సేవలతో ఎంతో మంది రక్తం, నేత్రాలు పొంది పునర్జీవనం పొందుతున్నారు. కరోనా సమయంలో కూడా ఈ ట్రస్ట్ విశేష సేవలను అందించింది. తాజాగా చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ఒక శుభవార్తను ప్రకటించింది. చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఎఫ్‌సీఆర్ఏ కింద నమోదు చేసుకునేందుకు కేంద్ర హోంశాఖ అవకాశం కల్పించింది. దీనిద్వారా ఈ ట్రస్ట్ ఇకపై విదేశాల నుంచి కూడా విరాళాలు తీసుకునే వెసులుబాటును పొందింది. ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖ అధికారులు అధికారికంగా ప్రకటించారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం 2010 ప్రకారం ఎఫ్‌సీఆర్ఏ అనుమతి తప్పనిసరి చేయడంతో చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ అప్పీల్‌కు అనుమతి లభించింది.

# సీఎం సొంతూరులో సర్పంచ్ ఏకగ్రీవం

**హైదరాబాద్, నవంబర్28:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంతూరులో సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సొంత గ్రామం అయిన కొండారెడ్డిపల్లిలో సర్పంచ్ స్థానం ఎస్సీకి రిజర్వ్ చేశారు. దీంతో సర్పంచ్ పదవి కోసం 15 మంది పోటీ పడ్డట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గ్రామంలోని పెద్దలంతా కలిసి సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేసినట్లు సమాచారం. అయితే ఎన్నిక ఏకగ్రీవమైనప్పటికీ.. సర్పంచ్ పేరును అధికారికంగా ప్రకటించలేదు. సర్పంచ్ పదవిని ఆశిస్తున్న 15 మందిలో.. ఒకరి పేరును సీల్డ్ కవర్‌లో ప్రకటించనున్నారని తెలుస్తోంది. దీంతో సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లిలో ఏ పార్టీ బలపరిచిన అభ్యర్థి విజయం సాధిస్తారనే ఉత్కంఠకు తెరపడినట్లైంది. సీఎం రేవంత్ రెడ్డి తన సొంతూరుతో కాంగ్రెస్ పార్టీ ఖాతా ప్రారంభించారని రాజకీయ




విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొండారెడ్డిపల్లి మాత్రమే కాకుండా ఇప్పటికే కొన్ని గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మంతన్ గౌడ్ గ్రామ సర్పంచ్ స్థానాన్ని ఎస్టీకి రిజర్వ్ చేశారు. అయితే గ్రామంలో ఆ రిజర్వేషన్ కేటగిరీకి చెందిన ఎరుకలి భీమప్ప కుటుంబం మాత్రమే ఉంది. దీంతో ఆ ఫ్యామిలీకి జాక్‌పాట్ తగిలినట్లు అయింది. ఎరుకలి భీమప్పకు భార్య వెంకటమ్మ ఇద్దరు కుమారులు ఎల్లప్ప, మహేష్ ఉన్నారు. రిజర్వేషన్ల ప్రకారం సర్పంచ్‌తో పాటు ఎస్టీ జనరల్, ఎస్టీ మహిళ.. రెండు వార్డు రిజర్వేషన్లు వచ్చాయి. అంటే భీమప్ప కుటుంబం నుంచే సర్పంచ్‌తో పాటు ఇద్దరు వార్డు సభ్యుల ఎన్నిక దాదాపు ఏకగ్రీవమైంది. ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలం రాఘవాపురంలో సర్పంచ్ ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. అయితే ఆ గ్రామంలో మొత్తం 471 ఓట్లు ఉండగా.. ఒకే ఒక ఎస్సీ కుటుంబం ఉంది. ఆ కుటుంబంలో తల్లి కాంపల్లి కోటమ్మ, కుమారుడు రమేశ్ మాత్రమే ఉన్నారు. సర్పంచ్‌తో పాటు 4వ వార్డు కూడా ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ అయింది. అంటే తల్లి సర్పంచ్‌గా, కుమారుడు వార్డు సభ్యుడిగా ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

# ఇమ్రాన్ మరణంపై పుకార్లు

- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- జైలుకు అనుమతించకపోవడంపై హైకోర్టులో పిటిషన్లు

**ఇస్లామాబాద్, నవంబర్ 28:** పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మరణ పుకార్ల వేళ ఆయన సోదరి అలీమా ఖాన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జైల్లో ఉన్న తన సోదరుడు ఇమ్రాన్ ఖాన్‌ను కలవడానికి అనుమతి నిరాకరించడంతో అడియాలా జైలు సూపరింటెండెంట్, ఇతరులపై ఇస్లామాబాద్ హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. రావల్పిండిలోని అడియాలా జైల్లో ఇమ్రాన్ ఖాన్‌ను వారానికి రెండుసార్లు కలిసేందుకు మార్చి 24న కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఆమె న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి మంగళ, గురువారాల్లో కలిసేందుకు అనుమతి ఇవ్వాలని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇప్పటినప్పటికీ జైలు అధికారులు వాటిని పాటించడం లేదని పేర్కొన్నారు. తన సోదరుడి శ్రేయస్సు, అతని చట్టపరమైన హక్కులు, జైల్లో అతని పట్ల అమానవీయంగా వ్యవహరించడం గురించి తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. న్యాయస్థానం ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా అమలు చేయకపోవడంతోనే కోర్టు ధిక్కార చర్యలను కోరినట్లు ఆమె పిటిషన్‌లో స్పష్టం చేశారు. వెంటనే తన సోదరుడిని కలిసేందుకు అనుమతించేలా అడియాలా జైలు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అధికార దుర్వినియోగం, అవినీతి కేసుల్లో 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైల్లో ఉన్న ఇమ్రాన్ ఖాన్ కొన్ని వారాల నుంచి బయటికి కనిపించడం లేదు. భద్రతా కారణాలు చెబుతూ జైలు అధికారులు అతని కుటుంబీకులను కూడా కలవనివ్వడం లేదు. దీంతో ఇమ్రాన్ ఖాన్‌ను జైల్లో చంపేశారంటూ ఊహాగానాలు




మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ ఖాన్ ముగ్గురు సోదరీమణులు అలీమా ఖాన్, నోరీన్ నియాజీ, డాక్టర్ ఉజ్మా ఖాన్‌తో పాటు పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పిటిఐ) మద్దతుదారులు అతన్ని కలవడానికి చాలాసార్లు ప్రయత్నించారు. కానీ జైలు అధికారులు ఒక నెలకు పైగా అనుమతిని నిరాకరిస్తూ వస్తున్నారు. చివరకు ఖైబర్-పఖ్తున్ఖ్వా ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది కూడా జైల్లో ఇమ్రాన్‌ను కలవడానికి ప్రయత్నించినా అనుమతి ఇవ్వలేదు. దీంతో ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళనలు పెరిగిపోయి పీటీఐ కార్యకర్తలు రోడ్డెక్కడంతో పాక్‌లో ఉద్రిక్తతలు చెలరేగాయి. ఈ క్రమంలో ఇమ్రాన్ ఖాన్ చనిపోలేదంటూ అతడి మరణ పుకార్లను అడియాలా జైలు అధికారులు తీవ్రంగా ఖండించారు. అతడు ఆరోగ్యం ఉన్నారని వివరణ ఇచ్చారు. డిసెంబర్ 2వ తేదీన కుటుంబ సభ్యులను ఇమ్రాన్ కలిసేందుకు అనుమతి ఇస్తామని తెలిపారు. అయినప్పటికీ ఇమ్రాన్ మరణ పుకార్లు పాకిస్తాన్ను కుదిపేస్తున్నాయి. తమ నాయకుడిని చూపించాలని డిమాండ్ చేస్తూ పీటీఐ మద్దతుదారులు అడియాలా జైలు దగ్గరకు భారీగా చేరుకుంటుండటంతో జైలు పరిసరాలు హై టెన్షన్ నెలకొంది. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ఇమ్రాన్ ఖాన్ ఉన్న జైలు వెలుపల దాదాపు 700 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు.

# కామారెడ్డిలో కవిత రైలురోకో

**బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు డిమాండ్**

- కార్యకర్తలకు, పోలీసుల మధ్య తోపులాట
- కవిత చేతికి స్వల్ప గాయం
- అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలింపు
- కాళేశ్వరంతో నిజామాబాద్‌కు ఒరిగిందేమీ లేదని వ్యాఖ్య
- నిజాం సాగర్ పూడికతీత పనులు వెంటనే చేపట్టాలి
- జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయాలి
- కామారెడ్డి పర్యటనలో జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్



**కామారెడ్డి, నవంబర్ 28:** కామారెడ్డిలో తెలంగాణ జాగృతి కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈక్రమంలో నిరసన చేస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అడ్డుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్‌రోకో నిర్వహించారు. కవిత పట్టాలపై బైఠాయించి ఆందోళన చేశారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగి ఆమె చేతికి స్వల్ప గాయమైంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శుక్రవారంకామారెడ్డిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైలు రోకో నిర్వహించారు. ఆమెతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు రైలు పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవితను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. అనంతరం వారు ట్రాక్‌పై కూర్చొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు అప్రమత్తమైన కామారెడ్డి పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి జాగృతి నేతలను అక్కడ నుంచి తప్పించే ప్రయత్నం చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో కవితను అరెస్ట్ చేశారు. ఈ పెనుగులాటలో కవిత చేతికి స్వల్ప గాయమైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం 17 శాతం రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లడం దారుణమన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, బీజేపీలు అడ్డుకుంటూ కుట్రలు చేస్తున్నాయని కవిత ఆరోపించారు. ఇకపోతే కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఒరిగిందేమీ లేదని విమర్శలు చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూడికతీతను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజాంసాగర్ టూరిజం, కౌలాస్ కోట ఓ స్పాట్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. మొంథా తుఫానుతో జిల్లాలో పత్తి రైతులు నష్టపోయారని చెప్పుకొచ్చారు. జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జిన్నింగ్ మిల్ కోసం జాగృతి పోరాటం చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల అనుమతి పేరుతో డబ్బులు తీసుకోవద్దని సూచించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికల్లో యువత ముందుకు వచ్చి ఆయా సమస్యలపై పార్టీలను ప్రశ్నించాలని సూచించారు. రోడ్ల కోసం ఆందోళన చేస్తుంటే జుక్కల్ ఎమ్మెల్యే యువకుల మీద కేసులు పెట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. యువతపై నమోదైన కేసులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్ వెంటనే ఉద్యోగులను తిరిగి స్వస్థలాలకు పంపించాలని సూచించారు. గొర్రెల కోసం డీడీలు కట్టి చాలా మంది అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. అర్హులకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. ఆటోవాళ్లకు వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు.



# యంగ్ ఇండియా స్కూల్స్ కాదు

**పురుగలన్నం లేకుండా కాపాడండి ● ఎక్స్ వేదికగా హరీష్ రావు డిమాండ్**

**హైదరాబాద్, నవంబర్ 28:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకుంటూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా నాణ్యమైన ఆహారం అందించలేని పరిస్థితి నెలకొన్నదని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పురుగులతో కూడిన అన్నం అందించిన ఘటనను గుర్తుచేస్తూ, ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పురుగులు లేని అన్నం పెట్టండని సీఎం రేవంత్ రెడ్డిని హరీష్ రావు డిమాండ్ చేశారు. సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నిసార్లు సమీక్షలు జరిపారో, విద్యార్థులకు కల్తీ ఆహారం పెడుతున్న వారిపై ఇప్పటిదాకా ఎన్ని చర్యలు తీసుకున్నారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామని అన్న మాటలు ఎక్కడికి పోయాయి? మీ మాటలకు విలువ లేదు, ఆచరణలో దిక్కులేదని హరీష్ రావు విమర్శించారు. పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేస్తూ, బడిలో చదువుకోవాల్సిన విద్యార్థులే రోడ్ల మీదకు వచ్చి ‘పురుగులన్నం మాకు వద్దు‘ అని నిలదీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్కాంలతోనే నిండిపోయిందని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టలేదని హరీష్ రావు ఆరోపించారు. కొమరం భీం ఆసిఫాబాద్ ఘటనపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# కేసీఆర్ దొంగదీక్షలతో తెలంగాణ రాలే

- ఉనికి కోసం దీక్షాదివస్ పేరుతో డ్రామాలు
- సోనియా దయవల్లనే తెలంగాణ సాకారం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల త్యాగాలు మరువలేనివి
- బీసీ రిజర్వేషన్ల అంశం ముగియలేదు
- మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



**హైదరాబాద్, నవంబర్ 28:** ఉద్యమ సమయంలో కేసీఆర్ చేసిన దీక్ష కారణంగానే తెలంగాణ రాలేదని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా తీసుకున్న నిర్ణయం వల్లనే తెలంగాణ సాకారమయ్యిందన్నారు. అంతేగానీ కేసీఆర్ దొంగ దీక్షలతో కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదన్నారు. దీక్ష పేరుతో కేసీఆర్ ఎనిమిది రోజులు ఫ్లూయిడ్స్ తీసుకున్నారని.. దీక్ష పేరుతో కేసీఆర్ నాటకం చేశారని ఆరోపించారు. కేసీఆర్ దీక్ష చేసిన సమయంలో డాక్టర్స్ రిపోర్టులను కేటీఆర్‌కు పంపుతామన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణకు వచ్చింది ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో చనిపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమిస్తే విద్యార్థులు పోరాటాన్ని కొనసాగించారని అప్పటి సంగతులను గుర్తుచేశారు. విద్యార్థుల ఆవేదన చూసి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు. కిరోసిన్ పోసుకున్న హరీష్‌రావుకి అగ్గిపెట్టె దొరకలేదా అని ప్రశ్నించారు. ఫ్లూయిడ్స్ తీసుకుని ఐరోమ్ షర్మిల 16 ఏండ్లు దీక్ష చేశారన్నారు. ఉనికి కోల్పోయిన బీఆర్ఎస్ కోట్లాది రూపాయలతో దీక్షా దివాస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం దీక్ష చేసినట్లు కేసీఆర్ నాటకం ఆడారని.. ఇప్పుడు దీక్షా దివాస్ పేరుతో మళ్ళీ సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దీక్షా దివాస్‌ను పక్కన పెట్టి సోనియా గాంధీకి పాలాభిషేకాలు చేయాలని హితవుపలికారు. తెలంగాణలో కేసీఆర్, ఆయన పార్టీకి నూకలు చెల్లిపోయాయని భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయమని కేసీఆర్‌కు అర్థమైందని.. అందుకే ఆయన బయటకు రావడం లేదంటూ కామెంట్స్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మహేష్ గౌడ్ స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కోర్టుకు వెళ్తామన్నారు. ఇంద్రా సహానీ, కృష్ణమూర్తి కేసులను ఛాలెంజ్ చేస్తామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశం ముగిసిపోలేదని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపు కోసం బీజేపీ అడ్డు పడుతోందని ఆరోపించారు. ఈ విషయంపై బీసీ నాయకులు.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్ళి ప్రశ్నించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడాలని ఎంపీలకు విన్నవించినట్లు తెలిపారు. హిడ్మా, గణపతి ప్రజాసేవ కోసం త్యాగం చేశాని పీసీసీ చీఫ్ అన్నారు. లొంగిపోదామని వచ్చే మావోయిస్టులకు అవకాశం ఇవ్వాలన్నారు. లొంగిపోదాం అనుకునే మావోయిస్టులు తెలంగాణకు రావచ్చని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు మతం పేరుతో విషం నింపుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో చిచ్చు పెట్టినన్ని రోజులు ఇండియా ముందుకు పోదని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

# కేసీఆర్ దీక్ష చేసినప్పుడు మీరంతా ఏమయ్యారు

**విమర్శకులకు మాజీమంత్రి తలసాని విసుర్లు**



**హైదరాబాద్, నవంబర్ 28:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మీద అవాకులు చవాకులు పేలినంత మాత్రాన ఆయన చరిత్ర మారదని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ స్పష్టం చేశారు. 2009 నవంబర్ 29వ తేదీన నాటి టీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన దీక్ష ఒక చరిత్ర అని ఆయన అభివర్ణించారు. ఈ దీక్షపై పలువురు సోయి లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కొత్త బిచ్చగాళ్లు పొద్దు ఎరగరు అన్నట్లుగా కొంత మంది వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ప్రత్యేక రాష్ట్రం రాకుంటే.. కాంగ్రెస్ పార్టీ ఎక్కడిది?.. తెలంగాణ ప్రభుత్వం ఎక్కడి దంటూ ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలను తలసాని శ్రీనివాసయాదవ్ సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. బతుకమ్మ పేరుతో ఆనాడు తమ ప్రభుత్వం చీరలు పంచితే.. ప్రస్తుతం ఇందిరమ్మ చీరలంటూ పేరు మార్చారని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు. ఈ చీరలు పంపిణీకి కేసీఆర్ తన పేరు పెట్టుకోలేదని గుర్తు చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ దీక్షా దివాస్‌ను ఘనంగా నిర్వహిస్తామని మాజీ మంత్రి తలసారి స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్ర తెలియని వాళ్ళు మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు మాట్లాడుతున్న వాళ్ళు.. తెలంగాణ ఏర్పాటు చేసే సమయంలో ఎక్కడున్నారంటూ? ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్టాన్ని సాధించకుంటే.. ఇప్పుడు మాట్లాడుతున్న వాళ్ళకి పదవి ఎక్కడిదని కాంగ్రెస్ పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన బల్ల గుద్ది ప్రశ్నించారు. తెలంగాణ రాష్టాన్ని సోనియా గాంధీ ఇచ్చారని నిండు అసెంబ్లీలోనే కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వాళ్ళ లాగా మూర్ఖుల్లా తాము మాట్లాడమని తలసాని శ్రీనివాసయాదవ్ స్పష్టం చేశారు.

# బీసీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

- 42శాతం రిజర్వేషన్ల పేరుతో మోసం
- కామారెడ్డి డిక్లరేషన్ తుంగలో తొక్కిన అధికార పార్టీ
- బీజేపీ ఎంపి ఈటల రాజేందర్



**హనుమకొండ, నవంబర్ 28:** బీసీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. ఓట్ల కోసం ఆ పార్టీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లపై వెనక్కి తగ్గినందుకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన డిమాండ్ చేశారు. తమకు అన్యాయం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలు కత్తులు నూరుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామాల్లో పూర్తి వ్యతిరేకత ఉందని.. ఇక, భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు గెలిచే అవకాశమే లేదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం నిధులతోనే జరుగుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి జరగాలంటే భాజపాతోనే సాధ్యం. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం సరిగా చేయలేదు. కుల ధ్రువీకరణ పత్రం కోసం సర్వర్లు పని చేయక అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కింది. బీసీ రిజర్వేషన్లపై డ్రామాలాడింది. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ ఈటల తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులకు గుర్తులు ఉండవని.. గెలిచిన వారిని కాంగ్రెస్ నుంచి గెలిచారని చెప్పుకుందామని భావిస్తున్నారేమో అంటూ సందేహం వ్యక్తం చేశారు. కానీ కాంగ్రెస్ చేసిన మోసానికి బీసీలు కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని...హామీ ఇచ్చేటప్పుడు తెలియదా? అంటూ అధికార పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. బీసీల జనాభా ఎంతో తేల్చకుండా రిజర్వేషన్లు ఎలా చేస్తారంటూ కాంగ్రెస్ సర్కారును ఆయన సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నాడు బీఆర్ఎస్ భూములు లాక్కున్నట్టే నేడు కాంగ్రెస్ పార్టీ లాక్కుట్టుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ భూ కుంభకోణాల కు హద్దు లేదు.. దీనికి మూల్యం చెల్లించక తప్పదంటూ ఎంపీ ఈటల హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోనే అధిక భూములు లాక్కుంటున్నారంటూ సోదాహరణగా వివరించారు. భూముల కోసమే జీహెచ్ఎంసీ పరిధి విస్తరించినట్లు అయితే.. దాని కంటే దరిద్రం ఇంకోటి లేదని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# అంబర్‌పేట ఎస్ఐ గన్ మిస్ కేసు

**కొనసాగుతున్న విచారణ**



**హైదరాబాద్, నవంబర్ 28 :** అంబర్‌పేట్ ఎస్ఐ గన్ మిస్సింగ్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. గన్ మిస్సింగ్‌పై ఎస్ఐ భానుప్రకాష్ రెడ్డి పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ పెట్టానో గుర్తులేదు అంటూ సమాధానాలు ఇస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భాను ప్రకాష్ ఐదు నెలల క్రితమే గన్‌ను మిస్ చేశాడు. జర్నీలో ఎక్కడో బ్యాగ్ పోగొట్టుకున్నా అని చెబుతూ వచ్చాడు. అయితే గత ఐదు నెలల నుంచి గన్ మిస్ అయిన విషయాన్ని పై అధికారులకు చెప్పకుండా ఎస్ఐ దాచిపెట్టినట్లు తెలుస్తోంది. మరొక ఉద్యోగం రావడంతో ఏపీకి వెళ్లేందుకు ఎన్వోసీని ఎస్ఐ అడుగగా.. సర్వీస్ రివాల్వర్ ఇవ్వాలని వారు సూచించారు. దీంతో అసలు బండారం బయటపడింది. ఎస్ఐ భానుప్రకాష్ తన గన్‌ను మిస్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో అంబర్‌పేట్ పోలీసులు ఇన్వెస్టిగేషన్ కొనసాగుతోంది.రోవైపు పోలీసు శాఖకు మచ్చ తెచ్చే విధంగా ఎస్ఐ ప్రవర్తించినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌లను ఆపాల్సిన ఎస్ఐ.. విపరీతంగా బెట్టింగ్‌లు ఆడి లక్షలు పోగొట్టుకున్నట్లు సమాచారం. అంతే కాకుండా బెట్టింగ్ కోసం ఏకంగా తన పొలాన్నే అమ్ముకున్న వైనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కడప జిల్లాలో ఉన్న రాయచోటిలో పొలాలను ఎస్ఐ అమ్ముకున్నాడు. దాదాపు రూ.96 లక్షలకు పైగా డబ్బులను ట్రాన్సాక్షన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.



సంపాదకీయం

# పత్తి రైతులపై నిబంధనల కత్తి!

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు చిత్తవుతున్నారు. రైతులు ఆనందంగా తమ పంటలను అమ్ముకున్నా మన్న భరోసాలో లేరు. ధాన్యం ఏదైనా దైన్యంగానే గడుపుతున్నారు. ముఖ్యంగా తెల్లబంగారం పండిస్తున్న రైతులు తెల్లమొహం వేయాల్సి వస్తోంది. పత్తి కొనుగోలులో రైతులకు సిసిఐ నిబంధనలు తీవ్ర ప్రతిబంధకం గా మారాయి.అమెరికా టారిఫ్ యుద్ధం నేపథ్యంలో భారత రైతుల ప్రయోజనాలను ఎట్టిపరిస్థితుల్లో కాపాడి తీరుతానని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ పత్తిపై దిగుమతి సుంకాన్ని 11 శాతం నుంచి సున్నాకు తగ్గించడం రైతుకు చివరి శరాఘాతమైంది. దీని ఫలితంగా అమెరికా, బ్రెజిల్ నుంచి విదేశీ పత్తి వరదలా వచ్చిపడుతుంటే స్వదేశీ పత్తి ధర లేక వెలవెలబోతున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి కొనుగోళ్ల సమస్యపై పూర్తి అలసత్వం చూపుతున్నాయి. సీసీఐ రెండుసార్లు టెండర్లు పెడితే మిల్లుల యాజమాన్యాలు ఎగ్గొట్టాయి. దాంతో విధిలేక మూడోసారి పిలవాల్సి వచ్చింది. వీటన్నిటి ఫలితంగా సిరులు తెస్తుందనుకున్న తెల్ల బంగారం రైతుల నడ్డి విరుస్తోంది. ఆశలు కోల్పోయిన పత్తి రైతులు పంటలను తగులబెడుతున్నారు. అన్నిరకాలుగా ఆశలు అడుగంటడంతో పత్తి రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి వచ్చింది. ప్రైవేటు వ్యాపారుల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపే ప్రేమలో లేశమైనా రైతుల మీద చూపితే ఈ పరిస్థితి వచ్చేది కాదు. పత్తి విక్రయానికి అనేక ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇ-క్రాప్‌లో నమోదు నమోదై ఉండాలి. దీంతోపాటు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి. సిఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో పేర్లు నమోదు చేశాక సమీప కొనుగోలు కేంద్రంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకొని వెళ్లాలి. ఎనిమిది శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే మూడు కేజీలు తరుగు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. 12శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పత్తిని అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్లను మాత్రమే కొనాలన్న నిబంధన రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఎకరాకు గరిష్టంగా 12 నుంచి 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, మొత్తం దిగుబడిలో సగం కొనుగోలు చేస్తే మిగతా పత్తి ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉన్నా కనీస మద్దతు ధర రూ.8,110 ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. అంతే కంటే ఎక్కువగా తేమ శాతం ఉంటే కొనుగోలు చేయడం లేదు. ఆరబెట్టి తీసుకురావాలని అధికారులు తెగేసి చెప్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ప్రస్తుతం మంచు కురుస్తున్నందున 15 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఆరబెట్టుకునేందుకు తగిన స్థలం లేదని చెప్తున్నారు. పత్తి కొనుగోలుకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలనే నిబంధనను రద్దు చేయాలని కోరుతున్నారు. ఇలా రైతన్నలను అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలతో మభ్య పెట్టడం తప్ప క్షేత్రస్థాయి సమస్యలను పట్టించుకోవడం లేదు.. ఏ సాయం అందకపోయినా, సొంతంగా పెట్టుబడి సమకూర్చుకొని, ఆరుగాలం కష్టపడి పంట పండించి అమ్ముదామని మార్కెట్‌కు పోతే కొనేవారు కరువు. దీని ఫలితంగా అన్నదాతలు, మరీ ముఖ్యంగా పత్తి రైతులుచిత్తవుతున్నారు. మద్దతు ధర అస్థిరంగా ఉండటం, ప్రకటించిన ధర కూడా ఇవ్వకపోవడం రైతులపాలిట శాపంగా మారుతున్నది. ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి, అటు కేందప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరి కారణంగా పత్తి రైతు పరిస్థితి అగమ్మగోచరంగా తయారయ్యింది. పత్తి కొనుగోలు విషయంలో రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ అడుగడుగునా కొర్రీలు వేస్తున్నది. గతేడాది మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 కాగా రైతుకు దక్కింది రూ.5,500 మాత్రమే. అంటే రూ.2,000 కోత కింద పోయింది. ఈ ఏడాది మద్దతు ధర రూ.8,100కు పెంచినట్టు చెప్తున్నప్పటికీ రైతు చేతికి వచ్చేది రూ.6,000 మాత్రమే. సీసీఐ స్వయంగా మద్దతు ధర పూర్తిగా చెల్లించనప్పుడు ప్రైవేటు వ్యాపారి మాత్రం ఎలా చెల్లిస్తాడని రైతులు వాపోతున్నారు. గతంలో పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకల నివారణకు సీసీఐ ప్రవేశపెట్టిన నిబంధనలపై జిన్నింగ్ మిల్లులు తీవ్రంగా ప్రతిఘటిస్తుండటంతో పత్తి కొనుగోళ్లకు అడ్డంకులు ఏర్పడ్డాయి. టెండర్ల ప్రక్రియకు బ్రేకులు పడి పత్తి రైతు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాడు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో విలవిలలాడుతున్న పత్తి రైతుకు యాప్ రూపంలో మరో గండం వచ్చిపడింది. కపాస్ కిసాన్ యాప్ ద్వారానే కొనుగోళు జరుపుతామని సీసీఐ షరతు పెట్టింది. చాలామంది రైతుల వద్ద ఇప్పటికీ స్మార్ట్ ఫోన్లు లేవు. పైగా రాష్ట్రమంతటా, ముఖ్యంగా పత్తిరైతులు ఎక్కువగా ఉండే ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సరైన మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేదు. దీంతో రిజిస్ట్రేషన్ నుంచి అమ్మకం దాకా సమస్యలు వెన్నాడాయి. యాప్ కనెక్ట్ కాకపోతే ప్రైవే టు వ్యాపారులే గతి అనే పరిస్థితి నెలకొన్నది. ఈలోగా వానలు, వరదలు ముంచెత్తడంతో పత్తిబేళ్లు తడిసి అసలుకే ఎసరు వస్తున్నది. ఇంకోవైపు ఎకరాకు సగటున 13 క్వింటాళ్లు కొంటామన్న సీసీఐ చివరి నిమిషంలో చెప్పాపెట్టకుండా ఎకరాకు 7 క్వింటాళ్లకు తగ్గించడంతో రైతుల నెత్తిన పిడుగుపడింది. తేమ శాతం ఎక్కువగా ఉందనో, రంగు మారిందనో ఇష్టారాజ్యంగా ధర చెల్లిస్తున్నారు. ఇప్పుడు 12 శాతం ఉంటేనే నాసిరకం అంటూ ధర తగ్గిస్తున్నారు. పంట దిగుబడి సమయంలో, మార్కెట్‌కు తరలించే సమయంలో వర్షాలు, తుఫానులు రావడం తెలిసిందే. తద్వారా తేమశాతం కొంచెం పెరగడమూ సహజమే. ఈ నేపథ్యంలో రైతు పట్ల కనీస సానుభూతితో వ్యవహరించ కుండా కొర్రీలతో చుక్కలు చూపించడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. ఇతర రాష్ట్రాల్లోనూ యాప్ కారణంగా పత్తి రైతులు యాతనలు పడ్డారు. పంజాబ్ రైతులైతే ఈ యాప్ తమకొద్దని తిరస్కరించారు.ఈ క్రమంలో దేశంలో పత్తి మార్కెట్ తీవ్రమైన కుదుపులు ఎదుర్కోవడం కారణంగా పత్తి పండింఏ రైతులకు శరాఘాతంగా మారింది. దీనిపై కేంద్రం వెంటనే స్పందించి, దేవీయంగా పత్తి రైతులను ప్రోత్సహించాల్సి ఉంది.

# ప్రపంచంలోనే ఎత్తయిన రాముడి విగ్రహం

- గోవాలో 77 అడుగుల స్టాచ్యూ
- ఆవిష్కరించిన ప్రధాని మోదీ





**గోవా, నవంబర్28:** గోవాలో శుక్రవారం అద్భుత ఘట్టం చోటుచేసుకుంది. దక్షిణ గోవాలోని కెనకోనా తాలూకా, పార్తగాలి గ్రామంలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్తగాలి జీవోత్తం మఠంలో 77 అడుగుల ఎత్తైన శ్రీరాముడి కాంస్య విగ్రహాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. మఠం 550వ వార్షికోత్సవ వేడుకలను (సార్ధ పంచశతామనోత్సవం) పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకలు నవంబర్ 27 నుండి డిసెంబర్ 7 వరకు జరుగనున్నాయి. ఈ విగ్రహం ప్రపంచంలోనే ఎత్తైన శ్రీరాముడి విగ్రహం కావడం విశేషం. ఇది ఆధ్యాత్మిక వారసత్వం, సాంస్కృతిక పరిరక్షణ ఆధునిక కళా నైపుణ్యం కలగలిపిన రూపంగా నిలుస్తుంది. గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి శ్రీపద్ నాయక్ అనేక మంది మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని ఈ విగ్రహావిష్కరణతో పాటు అనేక ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందులో ముఖ్యంగా రామాయణ థీమ్ పార్క్ ప్రారంభం ఉంది. రామాయణ కథలను ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ డిస్‌ప్లేల ద్వారా చూపించడానికి ప్రత్యేకంగా ఈ స్థలాన్ని ఏర్పాటు చేశారు. అలాగే రామ మ్యూజియంను కూడా ప్రారంభించారు. ఇందులో విజయనగర సామ్రాజ్యం నాటి పోస్టల్ స్టాంపులు, కవర్లు నాణేలు శ్రీరాముడి చిత్రపటాలు ప్రదర్శిస్తారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా ఇండియా పోస్ట్ ప్రత్యేక పోస్టల్ స్టాంపును, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రత్యేక నాణేన్ని విడుదల చేశాయి.

### 77 అడుగుల విగ్రహం

ఈ విగ్రహం మొత్తం 77 అడుగుల ఎత్తు ఉంది. దీనిని పూర్తిగా కాంస్య లోహంతో తయారు చేశారు. ఇందులో శ్రీరాముడు ధనుస్సు (బిల్లు), బాణం పట్టుకుని ఉన్న పౌరాణిక యోధుడి రూపంలో దర్శనమిస్తారు. ఈ అద్భుత శిల్పాన్ని ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన స్టాచ్యూ ఆఫ్ యూనిటీని రూపొందించిన ప్రఖ్యాత భారతీయ శిల్పి రామ్ వి. సుతార్ చెక్కారు.

# ఉడుపితో అనుబంధం విడదీయరానిది

**లక్ష కంఠ భగవద్గీత పఠనంలో మోడీ**



**బెంగళూరు, నవంబర్ 28:** ఉడుపి రావడం తనకు చాలా ప్రత్యేకమైంది అని ప్రధాని మోడీ అన్నారు. కర్ణాటకలోని ఉడుపిలో మోడీ పర్యటించారు. అంతకముందు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపుల నుంచి ప్రజలు పూల వర్షం కురిపించారు. అనంతరం ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠానికి వచ్చారు. ఈ సందర్భంగా లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొన్నారు. జగద్గురు శ్రీ శ్రీ సుగుణేళింద్ర తీర్థ స్వామీజీ విశ్వగీత పర్యాయ.. ప్రధాని మోడీని సత్కరించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఉడుపి జనసంఘ్, భారతీయ జనతా పార్టీకి సుపరిపాలన నమునాకు కర్మభూమిగా పేర్కొన్నారు. 1968లో ఉడుపి ప్రజలు జనసంఘ్ నుంచి వీఎస్.ఆచార్యను మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నుకున్నారని గుర్తుచేశారు. ఉడుపిలో కొత్త పాలనకు ప్రజలు పునాది వేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, సన్యాసులు, పండితులు, వివిధ రంగాలకు చెందిన పౌరులతో భగవత్ గీతను ఏకగ్రీవంగా పారాయణం చేయించారు. ఇక ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లలు దగ్గర నుంచి చిత్రాలను సేకరించాలని భద్రతా సిబ్బందిని, పోలీసు సిబ్బందిని మోడీ కోరారు.

# దిల్లీ పేలుడు కేసులో ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం

**అల్-ఫలా విశ్వవిద్యాలయానికి షాహిన్ ● సీన్ రిక్రియేషన్‌తో మూలాలు గుర్తించే యత్నం**



**న్యూఢిల్లీ, నవంబర్ 28:** దిల్లీ పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం గా సాగుతోంది. అన్ని కోణాల్లో దర్యాప్తును విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో భాగస్వామి అయిన డాక్టర్ షాహిన్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సీన్ రీక్రియేషన్ కోసం నిందితులతో సంబంధమున్న అల్-ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకువెళ్లారు. ఫరీదాబాద్ మాడ్యూల్ తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఎన్ఐఏ అధికారులు డాక్టర్ షాహిన్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. తామంతా కలిసి దాదాపు రెండేళ్ల నుంచి అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు ఆమె అంగీకరించింది. వీటిని ఉపయోగించి పాక్‌కు చెందిన జైషే ఉగ్ర సంస్థ కోసం దేశవ్యాప్తంగా దాడులు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిపింది. గురువారం విచారణలో భాగంగా డాక్టర్ షాహిన్ తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. అల్-ఫలా యూనివర్సిటీ సమీపంలోని మతపరమైన ప్రదేశంలో వారి వివాహం జరిగినట్లు తెలిపాడన్నారు. ఉగ్రకుట్ర దర్యాప్తులో భాగంగా ఈ కేసులో అరెస్టు చేసిన ఏడుగురు నిందితులను లఖ్‌నవూ, కాన్పూర్, సహరన్‌పూర్, ఫరీదాబాద్, జమ్మూకశ్మీర్‌లకు తీసుకువెళ్లనున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో జైషే మహిళా బ్రిగేడ్‌ల ఏర్పాటుకు షాహిన్ ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు ఇప్పటికే గుర్తించడంతో అల్-ఫలాలోని ఇతర మహిళా వైద్యులను కూడా ఆమె ప్రభావితం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. యూనివర్సిటీలో ఎవరైనా ఉగ్ర మద్దతుదారులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని.. వారిని గుర్తించడానికి నిఘా వర్గాలు పని చేస్తున్నాయన్నారు. అల్-ఫలాలో దర్యాప్తు తర్వాత తదుపరి విచారణ కోసం షాహిన్‌ను లఖ్‌నవూ, కాన్పూర్‌లకు తీసుకువెళ్లనున్నారు. అనుమానితులకు ఆయా ప్రదేశాల్లోని వ్యక్తులతో ఉన్న పరిచయాలు, ఎవరెవరు వారికి సహకరించారు అనే విషయాలను తెలుసుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఉగ్ర నెట్‌వర్క్‌తో మరికొందరు వైద్యులకు కూడా సంబంధాలు ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఉగ్ర మాడ్యూల్ ఆసుపత్రులు, క్లినిక్‌ల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తోందని.. సహాయం కోసం విద్యావంతులైన వ్యక్తులను నియమించుకుంటున్నట్లు గుర్తించామన్నారు.

# వేగంగా కదులుతున్న దిత్వా తుఫాన్

**తమిళనాడులో భారీ వర్షాలు కురిసే ఛాన్స్**

**చెన్నై, నవంబర్ 28:** ప్రస్తుతం శ్రీలంక తీరప్రాంతం, దాన్ని ఆనుకని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన 'దిత్వా తుఫాను' వేగంగా కదులుతోంది. ఈ వారాంతంలో ఉత్తర తమిళనాడువైపుకి కదులుతోందని, దీంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రామనాథపురం, తంజావూరు సహా ఐదు దక్షిణ తీరప్రాంత, డెల్టా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తుఫాను మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున ఆర్ఎంసి శుక్రవారం డెల్టా, దాని పరిసర జిల్లాలైన అరియలూర్, కడలూర్‌లకు ఆరెంజ్ అలర్ట్, ఎల్లో అలర్ట్ హెచ్చరికలను జారీ చేసింది. దిత్వా తుఫాను తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు దగ్గరగా కదులుతుందని, నవంబర్ 29,30, డిసెంబర్ 1 తేదీల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్‌లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి అంచనా వేసింది. మత్స్యకారులను వేటకు వెళ్లవద్దని తంజావూరు కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు కూడా ఒడ్డుకు తిరిగి వచ్చారని తెలిపారు.

# ఢిల్లీ కాలుష్యంపై ప్రణాళిక ఏదీ

**మోడీపై మరోమారు రాహుల్ విమర్శలు**

**పార్లమెంటులో చర్చిస్తామని వెల్లడి**



**న్యూఢిల్లీ, నవంబర్ 28:** ఢిల్లీని కాలుష్యం ముప్పు తిప్పలు పెడుతోంది. స్వచ్ఛమైన గాలి లేక నగర వాసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, పిల్లల పరిస్థితి అయితే మరీ దయనీయంగా మారింది. అనేక ఆరోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇక ప్రజలు బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ప్రస్తుతం వాతావరణం మరింత దారుణంగా తయారైంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఢిల్లీ వాసులు కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. ఢిల్లీలో జీవించలేక పోతున్నామని వాపోయారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఢిల్లీలో అత్యవసర ఆరోగ్య పరిస్థితిని విధించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఢిల్లీ కాలుష్యంపై చర్చ జరగాల్సిందేనని కోరారు. నేను కలిసిన ప్రతి తల్లి నాకు ఒకటే చెప్పారు. బిడ్డలు విషపూరిత గాలిని పీల్చుకుంటున్నారని. నీరసించి పోవడమే కాకండా భయపడు తున్నారని చెప్పారు. ఆందోళనగా ఉంటున్నారని వాపోయారు. మోడీ జీ.. భారతదేశ పిల్లలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మీరెలా మౌనంగా ఉండగల్గుతున్నారు? మీ ప్రభుత్వానికి ఎందుకు అత్యవసర ప్రణాళిక లేదు. జవాబుదారీతనం లేదా? అంటూ రాహుల్ గాంధీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితిని పరిష్కరించడానికి దేశానికి ఒక కార్యాచరణ ప్రణాళిక అవసరమన్నారు. మన పిల్లలు స్వచ్ఛమైన గాలికి అర్హులు- సాకులు, పరధ్యానాలు కాదని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ శీతా కాల సమావేశాల్లో చర్చ జరపాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

# అయ్యప్ప భక్తులకు శుభవార్త

**ఇరుముడితో ప్రయాణానికి ఎయిర్‌పోర్ట్ అథారిటీ అనుమతి**

**న్యూఢిల్లీ, నవంబర్ 28:** అయ్యప్ప స్వామి భక్తులకు ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శుభవార్త తెలిపింది. శబరిమలకు వెళ్లే మాలధారులు విమానాల్లో 'ఇరుముడి' తో ప్రయాణించొచ్చని తాజాగా వెల్లడించింది. విమానంలో కొబ్బరికాయలను స్వాములు తమ వెంట తీసుకెళ్లొచ్చని చెప్పింది. అయ్యప్ప స్వాముల నుంచి వచ్చిన వినతుల మేరకు, వారి సౌకర్యార్థం నిబంధనలను సడలించామని ఏఏఐ పేర్కొంది. ఈ నిబంధన అక్టోబర్ 28 శుక్రవారం నుంచి అమల్లోకి వస్తుందని ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఈ నిబంధనల సడలింపు అనేది వచ్చే ఏడాది జనవరి 20 వరకు అమలులో ఉంటుందని తెలిపింది. అయ్యప్ప స్వాముల ప్రయాణం సాఫీగా, సేఫ్‌గా జరగడానికి కొబ్బరికాయలను క్యాబిన్‌లోకి తీసుకెళ్లే ముందు ఎక్స్ రే, ఈటీడీ, భౌతిక తనిఖీలు ఉంటాయని పేర్కొంది.

# మోడీ అండతో అమరావతి పునర్నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

పునర్నిర్మాణానికి కేటాయించారు. రూ.1,334 కోట్లతో బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేయడం సంతోషదాయకం. బ్యాంకులు, బీమా కంపెనీల ఏర్పాటుతో 6,556 మందికి ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పేరిట బ్యాంకులు, ఆర్థిక సంస్థల కోసం అమరావతిలో స్థలం కేటాయించాం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, కెనరాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడీబీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఆప్కాబ్, నాబార్డ్, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ లు వచ్చాయని అన్నారు. సంస్థలన్నీ తమ ప్రధాన కార్యాలయాలను అద్భుతంగా నిర్మించాలని కోరుతున్నట్లు వెల్లడించారు. ప్రతీ ఇంట్లో మహిళలే ఆర్థిక మంత్రులు. మన దేశానికి కూడా మహిళా ఆర్థిక మంత్రే ఉన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంలో ఆమె అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారు. దేశాన్ని ప్రధాన మంత్రి అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే... ఆర్థికమంత్రి ఆదేస్థాయిలో సహకరిస్తున్నారు. జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ పెరగటంతో పాటు సామాన్యులకూ లబ్ది కలిగిందని బాబు అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ సంస్థ ఓ కాస్మోస్ ప్లానెటోరియం నిర్మాణానికి ఒప్పందం జరిగింది. ప్లానెటోరియం ఏర్పాటు చేసేందుకు అమరావతిలో స్థలం కూడా కేటాయించాం. ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థ, గతంలో విభజన వల్ల జరిగిన నష్టాల నుంచి ఇప్పుడే గాడిన పడుతున్నాం. ఇంకా ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి సాధించగలం అన్న విశ్వాసం మాకు ఉంది. త్వరలోనే సీడ్ యాక్సెస్ రహదారి కూడా పూర్తి అవుతుంది. 2028 కల్లా నిర్మాణాలు పూర్తి అవుతాయి. 7 జాతీయ రహదారులు, రైల్వేలైన్లు అమరావతికి కనెక్టు అవుతాయి. అమరావతి పూర్తిగా గ్రీన్, బ్లూ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని




వివరించారు. భారతదేశం గర్వపడేలా అమరావతిని నిర్మాణం చేస్తాం. విట్,ఎస్ఆర్ఎం, బిట్స్ పిలానీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు అమరావతికి వచ్చాయి. క్వాంటం వ్యాలీలో క్వాంటం కంప్యూటర్ కూడా ఏర్పాటు చేయ-ంబోతున్నాం. ఫైనాన్షియల్ డిస్టిక్ట్ ద్వారా ఆర్థిక లావాదేవీలు పెద్ద ఎత్తున జరిగేలా ప్రణాళిక చేశాం. 2047కి భారత్ అగ్రస్థానంలో ఉంటుంది. అందులో ఏపీది కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఆశ వదులుకున్న పోలవరాన్ని మళ్లీ రీస్టక్చర్ చేసేందుకు కేంద్రం సహకరించింది. రూ.400 కోట్లతో కట్టిన డయాఫ్రాం వాల్ ధ్వంసం అయితే మళ్లీ రూ.1,000 కోట్లు ఇచ్చి డయాఫ్రాం వాల్ నిర్మాణం చేసేందుకు నిధులిచ్చారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అలాగే 2028 నాటికి కూడా అమరావతి నిర్మాణాలు పూర్తి అవుతాయి. పరిశ్రమలు రాకుండా పారిపోయిన ఏపీకి మళ్లీ కూటమిపై భరోసాతో పెట్టుబడులు వస్తున్నాయి. రూ.1.37లక్షల కోట్ల పెట్టుబడులతో గూగుల్ విశాఖకు వస్తోంది. గోదావరి, కృష్ణా నదుల నుంచి వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో వృధాగా కలుస్తున్నాయి.పోలవరం నుంచి నల్లమల సాగర్ లింక్ ద్వారా నీళ్లు తీసుకెళ్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుంది. సముద్రంలోకి వెళ్లే మిగులు జలాలు వాడుకుని దేశసంపద పెంచేలా రాయలసీమకు నీళ్లు పారించాలని భావిస్తున్నాం అని వివరించారు. ఈ ప్రాజెక్టుకు నిధులు ఇచ్చి ఆదుకోవాలని ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దటంలో ఈ నీరు కీలకం అవుతుంది. ఆ ప్రాంతం అభివృద్ధి అవుతుంది. పూర్వోదయ ప్రాజెక్టు కింద ఉదారంగా నిధులు ఇస్తే రాయలసీమ, ఉత్తరాంధ్ర, మిగిలిన ప్రాంతాలు అభివృద్ధి అవుతాయి. కేంద్ర సహకారం వల్ల చాలా వరకూ రాష్ట్రం రికవర్ అవుతోంది. నిలదొక్కుకుని దేశప్రగతికి, సంపదకు బ్యాక్ బోన్ గా ఏపీ నిలబడుతుందని హామీ ఇస్తున్నాను. కేంద్ర సహకారంతో అమరావతి అన్ స్టాపబుల్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమరావతి నిర్మాణం అంటే ఒక యజ్ఞం



**అమరావతి :** రాజధానిలో 25 బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేష్, నారాయణ హాజరయ్యారు. రాజధాని సీడ్ యాక్సెస్ రహదారి పక్కన సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మొదటి బ్లాక్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలా సాతీరామన్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి రీస్టార్ట్ చేయటం సంతోషం. దేశంలో ఒక కొత్త రాజధాని నగరం నిర్మించటం సామాన్యమైన విషయం కాదు. నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోదీ కూడా సహకరిస్తున్నారు. అమరావతి నిర్మాణం అంటే ఒక యజ్ఞం లాంటిది. ఇంత పెద్ద నగరానికి ఆర్థికంగా భరోసా ఉండాలన్న నిర్ణయంతోనే ఇవాళ పీఎస్‌యూ సంస్థలు ప్రధాన కార్యాలయాలు వస్తున్నాయి. 5 ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థలు ఇక్కడ ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఫై÷నాన్షియల్ డిస్టిక్ట్ లో ఒకే చోట బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు ఉండటం అభినందనీయం అని నిర్మల అన్నారు.రాజధాని నిర్మాణంలో రైతుల త్యాగాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదు. బ్యాంకులన్నీ రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవటం బాధ్యత.
బ్యాంకులు కేవలం కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు ఇవ్వడానికే పరిమితం కావొద్దు. దానిని మించి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని సూచించారు. 25 కోట్ల మందిని ఇప్పటి వరకూ దేశంలో దారిద్య్రరేఖ నుంచి బయటకు వచ్చారు. ధ్యతరగతి ఆస్పిరేషన్స్ కూడా పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి.రైతులు దేశానికి పౌష్టికాహారం అందిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి అరటి, తమిళనాడు నుంచి కొబ్బరి ఢిల్లీ , ముంబై లాంటి ప్రాంతాలకు రైళ్లలో తరలుతున్నాయి. అలాగే ఇతర పంటలకూ ఈ తరహా మార్కెటింగ్ సౌలభ్యాలు ఉంటే వారికి ఆర్థిక ప్రయోజనాలు అందుతాయన్నారు. రాయలసీమలో ఉన్న 9 జిల్లాల నుంచి ఉద్యాన ఉత్పత్తులు ఇతర రాష్ట్రాల మార్కెట్ లకు తరలించడానికి బ్యాంకులు సహకరించాలి.కేవలం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణం ద్వారా ఇది సరిపోదు. ప్యాకింగ్, కోల్డ్ చెయిన్ లాంటి పరిశ్రమల్ని కూడా ప్రోత్సహించాలని గుర్తుంచుకోండి. భవిష్యత్ ఆలోచనలు, సమీకృత ఐడియాలను బ్యాంకులు కలిగి ఉండాలి.గతంలో మహిళల్ని బీమా ఏజెంటుగా మార్చేందుకు మహిళా సఖి పేరిట కార్యక్రమం ప్రారంభిస్తే అద్భుత ప్రయోజనాలు వచ్చాయి.ఎప్పుడు ఆంధప్రదేశ్ గురించి మాట్లాడినా ప్రధాని మోదీ తక్షణం అమోదిస్తారు. విభజన తర్వాత ఇబ్బందులు ఎదుర్కొన్న ఆంధప్రదేశ్‌కు పూర్తిగా సహకరించాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. క్వాంటం వ్యాలీ, ఏఐ ప్రాజెక్టుల కోసం జిల్లాల్లో ఏఐ శిక్షణ పొందేలా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. కేవలం ఐటీ గురించే కాదు ఆస్ట్రో ఫిజిక్స్ గురించి కూడా కేంద్రం ఆలోచిస్తోంది.. ఏపీ ప్రభుత్వంతో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ సంస్థ ఇవాళ ఒప్పందం చేసుకోవటం సంతోషకరం. ఏడాదిన్నరలో ఏపీ ఫ్యూచరిస్టిక్ కేపిటల్ నగరం అవుతుంది. అమరాతిలో కాస్మోస్ ఎ÷-లానెటోరియం నిర్మించాలని కోరుతున్నా. ఆచార్య నాగార్జునుడు లాంటి శాస్త్రీయ పరిశోధకులు నివసించిన ప్రాంతం ఇదని గుర్తు చేశారు.రేర్ ఎర్త్ మినరల్స్ పై కూడా కేంద్రం ఓ కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఈ రంగంలో కూడా ఏపీ పనిచేయాలని కోరుతున్నానని ఆమె అన్నారు.

## స్పీకర్‌ను కలిసిన జర్మనీ దేశ అధికార సోషల్ డెమోక్రటిక్ పార్టీ బృందం



**హైదరాబాద్ నవంబర్28( సమయం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసిన జర్మనీ దేశ అధికార సోషల్ డెమొక్రటిక్ పార్టీ ప్రతినిధుల బృందం. తెలంగాణ రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన జర్మనీ SDP సెక్రటరీ జనరల్ సబీనా ఫెండరీచ్, ఆసియా-పసిఫిక్ హెడ్ మైక్రో గుంథర్, ఇండియా డైరెక్టర్ క్రిస్టోఫ్ పి మోర్ లు మరియు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, లేజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహా చార్యులు, అధికారులు ఈ మర్యాదపూర్వక సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం 2014 లో నూతనంగా ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ, శాసనమండలి ఉన్నాయి. శాసనసభలో 119 మంది సభ్యులు, శాసనమండలి లో 40 మంది సభ్యులు ఉన్నారు. శాసనసభ సభ్యులను ఎన్నికల ద్వారా ప్రజలు నేరుగా ఎన్నుకుంటారు. తెలంగాణ శాసనసభలో చర్చలు అర్థవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధిలో ముందున్నది. రాష్ట్రంలో పెట్టుబడులకు మంచి అవకాశం ఉండడంతో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. ఈసందర్భంగా జర్మనీ బృంద సభ్యులకు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించిన అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు.

## అప్పుల భారం తగ్గింపు, గూగుల్ ప్రాజెక్టుపై కీలక నిర్ణయాలు




**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలకమైన, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడం, మౌలిక సదుపాయాల కల్పనలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించడం, ప్రతిష్టాత్మక పారిశ్రామిక ప్రాజెక్టులను వేగవంతం చేయడం వంటి అంశాలపై కేబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. ముఖ్యంగా, రాష్ట్రంపై ఉన్న అధిక వడ్డీ రుణాల భారాన్ని తగ్గించే వ్యూహాత్మక నిర్ణయం ఈ సమావేశంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

**ఖజానాకు ఊరటనిచ్చే 'అప్పుల స్వాపింగ్**

గతంలో రాష్ట్ర ప్రభుత్వం 11 నుంచి 12 శాతం వంటి అధిక వడ్డీ రేట్లకు వేల కోట్ల రూపాయల రుణాలను సమీకరించింది. ఈ అధిక వడ్డీ చెల్లింపులు రాష్ట్ర ఖజానాపై తీవ్రమైన భారాన్ని మోపుతున్నాయని కేబినెట్ సమావేశంలో చర్చకు వచ్చింది. అయితే, ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ మె-రుగుపడటంతో క్రెడిట్ రేటింగ్ పెరిగింది. ఈ సానుకూల పరిణామాన్ని రాష్ట్రానికి అనుకూలంగా మలచుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న అధిక వడ్డీ రుణాలను, మార్కెట్‌లో తక్కువ వడ్డీకి లభిస్తున్న కొత్త రుణాలతో మార్పిడి ('స్వాప్') చేయాలని ఆర్థిక శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రక్రియ ద్వారా వడ్డీల రూపంలో చెల్లించే కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఆదా చేయవచ్చని, ఆ నిధులను ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మళ్లించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఇది రాష్ట్ర ఆర్థిక క్రమశిక్షణ దిశగా వేస్తున్న ఓ ముఖ్యమైన అడుగుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**ప్రభుత్వ సంస్థలకు ఫైర్ ఎన్‌ఓసీ రుసుము రద్దు**

మరో కీలక నిర్ణయంలో, రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ఫైర్ సేఫ్టీ ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) కోసం చెల్లించాల్సిన ముందస్తు



జాగ్రత్తల రుసుము నుంచి మినహాయింపు ఇస్తూ మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఏపీ జెన్కో చైర్మన్, ఎండీ చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మినహాయింపు జాబితాలో మంగళగిరి ఎయిమ్స్, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ భవనాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఏపీ జెన్కో, ఏపీపీడీసీఎల్ థర్మల్ పవర్ స్టేషన్లు ఉన్నాయి. ఈ నిర్ణయంతో ప్రజాసేవలో ఉన్న ఈ కీలక సంస్థలపై ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, పరిపాలన ప్రక్రియలు కూడా సులభతరం కానున్నాయి.

**గూగుల్ డేటా సెంటర్ భాగస్వాములకు ఆమోదం**

రాష్ట్ర ప్రతిష్టను పెంచే గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసే దిశగా కేబినెట్ మరో ముందడుగు వేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకోనున్న ఆరు భాగస్వామ్య కంపెనీలను గుర్తించడానికి ఆమోదం తెలిపింది. గూగుల్ యొక్క 100 శాతం అనుబంధ సంస్థ అయిన 'రైడన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అదానీ ఇన్ఫ్రా, అదానీ కోనెక్స్, అదానీ పవర్, భారతీ ఎయిర్‌టెల్, ఎక్స్‌ట్రా డేటా, ఎక్స్‌ట్రా వైజాగ్ లిమిటెడ్ సంస్థలను భాగస్వాములుగా గుర్తించారు. అయితే, ఈ కంపెనీల చేరికతో గతంలో రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ కుదుర్చుకున్న ప్రధాన ఒప్పందంలోని నిబంధనలైన పెట్టుబడి, నాణ్యత, ప్రాజెక్టు పూర్తి చేసే కాలపరిమితి వంటి అంశాల్లో ఎలాంటి మార్పు ఉండబోదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఆమోదంతో ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం కానున్నాయి.

## హైదరాబాద్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి: కిషన్ రెడ్డి



**హైదరాబాద్ నవంబర్28( సమయం న్యూస్):** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వచ్చే ఏడాదిలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి శుక్రవారం కేంద్రమంత్రి పరిశీలించారు. హైదరాబాద్‌లోని అన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది అందుబాటులోకి తెస్తామన్నారు. హైటెక్ సిటీతో పోటీపడే విధంగా అక్కడి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రూ.35 కోట్లతో రెండు విడతలుగా పనులు జరుతున్నాయని, వచ్చే ఫిబ్రవరిలోపు తొలి విడత పూర్తవుతాయన్నారు. సంక్రాంతి సందర్భంగా 16 ప్రత్యేక రైళ్లు ఇక్కడ ఆపుతామని పేర్కొన్నారు.

## ఫుట్వేర్ సిరీస్ ప్రదర్శనను ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**హైదరాబాద్ నవంబర్28( సమయం న్యూస్) :** ఫుట్వేర్ డిజైన్, డెవలప్మెంట్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్ PLEACH ఇండియా ఫౌండేషన్‌తో కలిసి "మడ మల కింద కథలు- భారతదేశం డిజైన్ భాష:ఫుట్వేర్ సిరీస్" ప్రత్యేక ప్రదర్శనను ఈరోజు ఘనంగా ప్రారంభించింది. తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ ప్రదర్శనను ప్రారంభించి, భారతీయ పాదరక్షల రూపకల్పనలో సంప్రదాయ నైపుణ్యాన్ని ఆధునిక డిజైన్‌తో అనుసం ధానం చేయడం సమయోచితమని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జాయేష్ రంజన్ గౌరవ అతిథిగా పాల్గొని FDDI-PLEACH భాగస్వామ్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్‌కు సంబంధించిన బుక్‌లెట్ మరియు "బుక్ ఆఫ్ ఫుట్‌నోట్స్" విడుదలయ్యాయి. అలాగే దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఏడు మాస్టర్ ఆర్టిసన్లు మొజారి, జుట్టీ, కొల్హాపురి చప్పల్ వంటి సంప్రదాయ పాదరక్షల క్రాఫ్ట్‌ను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ప్రదర్శన నవంబర్ 28%-%30 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంద నీ నిర్వాహకులు తెలిపారు.



# ఆదిలాబాద్‌లో సుప్రీం కోర్టు తీర్పు బందీ!?




దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన చారిత్రక తీర్పు నేడు ఆదిలాబాద్ జిల్లాలో ఒక ప్రభుత్వోద్యోగి అధికార గర్వానికి, దుర్వినియోగానికి బంధీ అయ్యిందా? అనే అనుమానం కలుగుతోంది. సామాన్య పౌరులపై కొరడా ఝుళిపించే ప్రాంతీయ రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసులు, ఒక ఆహార తనిఖీ అధికారి తన వ్యక్తిగత వాహనం కిటికీలకు నిషేధిత ముదురు రంగు పొరలు (డార్క్ ఫిల్మ్) వాడినప్పటికీ, చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న భయం, పక్షపాతం ఏమిటి? చట్టాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థే చేష్టలుడిగి మౌనం వహించడంతో, న్యాయవ్యవస్థ ఆదేశాల పవిత్రత ఒక ఉద్యోగిణి అహంకారానికి లోబడిపోయిన విచిత్ర పరిస్థితి నెలకొంది.

- సమయం ప్రత్యేక ప్రతినిధి, ఆదిలాబాద్




### న్యాయస్థానం ఆదేశాలు..

చట్టం గొప్పది దానిని అమలు చేసే వ్యవస్థ ఎక్కడ? సుప్రీంకోర్టు 2012, ఏప్రిల్ 27న ఇచ్చిన తీర్పు ప్రకారం, వాహనం అద్దాలకు ఉండాల్సిన 50% కాంతి ప్రసారం (వెలుగు పారే శాతం) నిబంధనను ఉల్లంఘించడం స్పష్టమైన చట్టవిరుద్ధ చర్య. నియమాన్ని ఉల్లంఘిస్తూ, జిల్లా ఆహార తనిఖీ అధికారిణి తన వాహనానికి నీలం/నలుపు పొరలను వాడటం అనేది, న్యాయస్థానం ఆదేశాలను బహిరంగంగా నిర్లక్ష్యం చేయడమే. ఈ అక్రమాన్ని చూసి కూడా మోటారు వాహన తనిఖీ అధికారులు మరియు పోలీసు వ్యవస్థ నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం, చట్టాన్ని అమలు చేసే వ్యవస్థకు పట్టిన లోపంగా విమర్శకులు అభివర్ణిస్తున్నారు.




### బెదిరింపుల రాజకీయం!

ఆహార తనిఖీ అధికారిణికి ఎందుకీ 'విశిష్ట వ్యక్తి' చికిత్స? సదరు ఆహార తనిఖీ అధికారిణి కేవలం చట్టాన్ని ఉల్లంఘించడమే కాకుండా, తన హోదాను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. తన ఉల్లంఘన గురించి ప్రశ్నిస్తే, సామాన్య పౌరులను 'కేసులు పెట్టిస్తాం' అంటూ హెచ్చరించడం ఆమె అధికార గర్వానికి నిదర్శనం. ప్రజా సేవకురాలిగా ఉండాల్సిన అధికారిణి, ప్రజలను బెదిరించే స్థాయికి దిగజారడం వ్యవస్థకే సిగ్గుచేటు. ఆశ్చర్యకరంగా, ఆమె సొంత శాఖకు చెందిన ఉన్నతాధికారులు సైతం ఆమెతో మాట్లాడడానికి జంకుతున్నారు. అంటే, చట్టం కాదు, ఆ అధికారిణి అధికారం మాత్రమే చెల్లుబాటు అవుతుందా? బెదిరింపుల కారణంగానే, అమలు అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారా అనే బలమైన అనుమానం కలుగుతోంది.

### రవాణా శాఖ వైఫల్యం..

నిబంధనలు 'విశిష్ట వ్యక్తులకు' వర్తించవా? ఉల్లంఘనపై మౌనం ఎందుకు? సామాన్య పౌరుడు చిన్న ఉల్లంఘన చేసినా వెంటనే వేలకు వేలు జరిమానా వేసే ప్రాంతీయ రవాణా శాఖ మరియు ట్రాఫిక్ రక్షకభటులు, తమ తోటి ప్రభుత్వ శాఖల అధికారుల ముదురు పొరల నాటకాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు? వారి వ్యక్తిగత వాహనాలను తనిఖీ చేయడంలో వారికి




అడ్డంకులు ఏంటి? ఇది కేవలం ట్రాఫిక్ నియమం ఉల్లంఘన మాత్రమే కాదు, ఇది ప్రభుత్వ యంత్రాంగంలో నెలకొన్న అవినీతి మరియు పక్షపాత వైఖరిని సూచిస్తుంది. చట్టాన్ని అమలు చేయడంలో ఈ ద్వంద్వ వైఖరి, ప్రజలలో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది.

### ఉల్లంఘనలకు పరిష్కారం ఏమిటి?

ఉల్లంఘనలకు వీడ్కోలు.. తక్షణ చర్యలు అవసరం! మోటారు వాహన చట్టం కింద ముదురు పొరలను ఉపయోగించడం శిక్షార్హం. మొదటి ఉల్లంఘనకే జరిమానాతో పాటు, సంఘటన స్థలంలోనే పొరలను తొలగించాలని ఆదేశాలు ఉన్నాయి. ఈ ఆహార తనిఖీ అధికారిణి వాహనంపై చర్య తీసుకోకపోవడం, చట్టాన్ని అమలు చేసే వారిపైనే ప్రశ్నార్థకంగా మారుతోంది. జిల్లా పాలనాధికారి (కలెక్టర్), జిల్లా పోలీసు ఉన్నతాధికారి (ఎస్పీ) వంటి ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, ఆ అధికారిణి వాహనంపై జరిమానా విధించి, పొరలను తొలగించడమే కాకుండా, ఈ ఉల్లంఘనను పట్టించుకోని సంబంధిత అమలు అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి.

### వ్యవస్థలో జవాబుదారీత..

ఇటువంటి ఉల్లంఘనలను గమనించిన సామాన్య పౌరులు ఇకపై మౌనంగా ఉండకూడదు. ఈ ముదురు పొరల నాటకాన్ని అంతం చేయాలంటే, పౌరులు తమ చరవాణిలలో చిత్రాలు లేదా దృశ్యాలను సాక్ష్యాలుగా నమోదు చేసి, జిల్లా ఉన్నతాధికారులకు లేదా ప్రభుత్వ నిఘా శాఖకు ఫిర్యాదు చేయాలి. ఆహార తనిఖీ అధికారిణి వాహనంపై ఉన్న పొరలను వెంటనే తొలగించడం ద్వారా, అధికార గర్వం ముందు పౌర శక్తి గెలిచిందని నిరూపించాలి. జవాబుదారీతనం లేని వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడానికి పౌరుల నిరంతర ప్రశ్నలు చాలా అవసరం.

### చట్టం దృష్టిలో విఫలమైన జిల్లా యంత్రాంగం

ఆదిలాబాద్ జిల్లాలో ఒక ప్రభుత్వ ఉద్యోగి వ్యక్తిగత వాహనంపై ముదురు పొరల ఉల్లంఘన కొనసాగడం అనేది, జిల్లా యంత్రాంగం చట్టం దృష్టిలో విఫలమైంది అని స్పష్టం చేస్తోంది. ముదురు పొరల నాటకానికి తెరదించి, రాజ్యాంగం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత జిల్లా పోలీసు మరియు ప్రాంతీయ రవాణా శాఖలపై ఉంది. ఉన్నతాధికారుల జోక్యం లేకుండా సమస్య పరిష్కారం కాదు. తక్షణమే చర్యలు తీసుకుని, చట్టం అందరికీ సమానం అని నిరూపించాలని దిశ వార్తా సంస్థ డిమాండ్ చేస్తోంది.

# తెలంగాణ పోలీసులకు దేశం సెల్యూట్!!






మాదకద్రవ్యాల మహమ్మారి దేశ భవిష్యత్తును కబళిస్తున్న తరుణంలో, తెలంగాణ రాష్ట్ర పోలీసు బలగాలు సరిహద్దులు దాటి చూపిన సాహసం, సమర్థత యావత్ దేశానికే ఆదర్శనీయం. గంజాయి, కొకైన్, మెతాంఫెటమైన్ వంటి సింథటిక్ డ్రగ్స్‌ను సరఫరా చేస్తూ, దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా తమ విషవలయాన్ని విస్తరిస్తున్న అంతర్జాతీయ డ్రగ్ మాఫియా నెట్‌వర్క్‌పై తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (ఈగల్) పంజా విసిరింది. నిత్య నిఘా, పక్కా వ్యూహంతో నెలల తరబడి సాగిన అసాధారణ ఆపరేషన్ ఇది. కేవలం రాష్ట్రంలోనే కాకుండా, జాతీయ స్థాయిలోనూ మాదకద్రవ్యాల మూలాలను ఛేదించాలన్న తెలంగాణ పోలీసుల సంకల్పం ఎంత పటిష్టమైందో ఈ విజయం తేటతెల్లమైంది. క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతం చేసిన తీరు వృత్తి నైపుణ్యాన్ని, ధైర్యాన్ని చాటి చెప్పింది. తెలంగాణ పోలీసులు నిబద్ధతతో, పట్టుదలతో పనిచేస్తే ఎలాంటి అసాధ్యాన్ని అయినా సుసాధ్యం చేయగలరని నిరూపించారు. యువత భవిష్యత్తుకు రక్షణ కల్పించాలన్న సంకల్పం నిరుపమానం.

### సంచలనం సృష్టించిన రహస్య కార్యాచరణ

ఒక చిన్న కేసు దర్యాప్తు నుంచి ఆరంభమై, అంతర్జాతీయ స్థాయి డ్రగ్ కార్టెల్‌కు సంబంధించిన రహస్యాన్ని ఛేదించడం వెనుక తెలంగాణ పోలీసుల అంకితభావం అసామాన్యం. హైదరాబాద్ కొంపల్లిలోని ఒక రెస్టారెంట్ నిర్వాహకుడి అరెస్టుతో లభించిన చిన్న ఆధారం, అంతర్జాతీయ డ్రగ్ డీలర్ 'నిక్' నేతృత్వంలోని భారీ నెట్‌వర్క్‌ను గుర్తించడానికి దారితీసింది. ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో ఏకంగా 124 మంది 'ఈగల్' బృందం ప్రత్యేకంగా రెండు రైలు బోగీల్లో ఢిల్లీకి తరలివెళ్లింది. సాధారణ ఆటోల్లో రెక్కీ నిర్వహించిన అధికారులు సహా, బృందం సభ్యులు వారం రోజుల పాటు అక్కడే మకాం వేసి, పక్కా ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సేకరించారు. ఇదొక సినిమా దృశ్యాన్ని తలపించే సాహసోపేతమైన 'రహస్య కార్యాచరణ' అనడంలో ఎలాంటి సందేహం లేదు.

### వణుకు పుట్టించిన అరెస్టులు..

తెలంగాణ పోలీసుల వ్యూహం, ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్‌తో సమన్వయం కారణంగా ఆపరేషన్ సంపూర్ణంగా విజయవంతమైంది. ఢిల్లీ, గ్రేటర్ నోయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలలో ఏకకాలంలో దాదాపు 20 ప్రాంతాలపై దాడులు నిర్వహించి, సుమారు 50 మంది నైజీరియన్లు సహా విదేశీయులను అదుపులోకి తీసుకున్నారు. ఇంతమంది అంతర్జాతీయ డ్రగ్ స్మగ్లర్లు ఒకేసారి పట్టుబడటం దేశ చరిత్రలోనే ఇదే తొలిసారి కావడం విశేషం. కిలోల కొద్దీ అత్యంత విలువైన సింథటిక్ డ్రగ్స్‌ను, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు 'డెడ్ డ్రాప్' పద్ధతి, ఫుడ్ డెలివరీ యాప్‌లు, చివరికి సెక్స్ వర్కర్లు, సేల్స్ గర్ల్స్‌ను వినియోగించి తమ దందాను నడిపినట్లు వెల్లడైంది.

### హవాలా రాకెట్ గుట్టురట్టు..

డ్రగ్స్ మాఫియా కేవలం మాదకద్రవ్యాల అమ్మకాలతోనే ఆగిపోలేదు. ఈ ముఠా డ్రగ్స్ అమ్మగా వచ్చిన డబ్బును అక్రమ మార్గాల్లో నైజీరియాకు తరలించేందుకు ప్రత్యేకమైన హవాలా రాకెట్‌ను నడిపినట్లు దర్యాప్తులో తేలింది. ఇండియన్ కరెన్సీని వస్తువులు, దుస్తులు, విగ్గుల కోసం ఉపయోగించే తలవెంట్రుకల రూపంలోకి మార్చి నైజీరియాలోని లాగోస్‌కు షిప్పింగ్ చేస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడింది. నిందితుల ఖాతాలలో ఒక్కొక్కరి వద్ద సుమారు ఐదు నుంచి ఆరు కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు, అలాగే ప్రధాన సూత్రధారి ఒక్కడే సుమారు 15 కోట్ల రూపాయల హవాలా లావాదేవీలు నడిపినట్లు పోలీసులు గుర్తించారు.

### పోలీసింగ్ ప్రమాణాలు పెంచిన ధైర్యం..

తెలంగాణ పోలీసుల చర్య నార్కోటిక్స్ నియంత్రణలో ఒక సరికొత్త ఒరవడిని సృష్టించింది. 'ఈగల్ ఫోర్స్' అంటేనే మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పదునైన, ఉక్కుపాదం మోపే బృందంగా దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకుంటోంది. తమ రాష్ట్రానికి ముప్పు కలిగించే నెట్‌వర్క్‌ను వేరే రాష్ట్రంలోకి వెళ్లి ఛేదించడం ద్వారా, అంతర్రాష్ట్ర పోలీస్ సహకారం, సమర్థతలకు నూతన ప్రమాణాలు నెలకొల్పారు. కట్టుదిట్టమైన ప్రణాళిక, ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బంది గుప్తంగా నెలల తరబడి పనిచేయడం, ఇవన్నీ తెలంగాణ పోలీస్ పనితీరుకు నిదర్శనం.

### వేలాది కస్టమర్ల గుండెల్లో గుబులు..

ముఠాకు హైదరాబాద్, బెంగళూరు, గోవా, కేరళ వంటి మహానగరాల్లో దాదాపు 2,000 మందికి పైగా రెగ్యులర్ కస్టమర్లు ఉన్నట్లు తేలింది. వీరిలో చాలామంది విద్యార్థులు, యువత ఉన్నట్లు సమాచారం. డ్రగ్స్‌కు బానిసలవుతున్న వేలాది మందికి ఈ ఆపరేషన్ ఒక గుణపాఠంగా మారాలి. పోలీసులు పట్టుకున్న నైజీరియన్లను ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించి, కస్టడీకి తీసుకొని విచారించనున్నారు. విచారణ ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేసిన వేలాది మంది కస్టమర్ల గుట్టు రట్టై, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.

### అభినందనీయం..

తెలంగాణ పోలీసుల 'ఈగల్ పంజా' అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా గుండెల్లో భయం పుట్టించింది. సాహసోపేతమైన ఆపరేషన్, అపారమైన కష్టం, అంకితభావం, అత్యంత పకడ్బందీ వ్యూహం... అన్నీ మెచ్చుకోదగినవే. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం సరిహద్దులను లెక్కచేయకుండా పోరాడిన తెలంగాణ 'ఈగల్ ఫోర్స్' సిబ్బందికి యావత్ దేశం హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తోంది. ఈ విజయంతో ఇతర రాష్ట్రాల పోలీస్ బలగాలు కూడా స్ఫూర్తి పొంది, దేశవ్యాప్తంగా డ్రగ్ మాఫియాపై సమష్టి పోరాటాన్ని మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించడంలో తెలంగాణ పోలీసులు అగ్రగామిగా నిలబడ్డారు.

ఫిరోజ్ ఖాన్
సీనియర్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464



## ఆకలి బాధలు లేని హైదరాబాద్ లక్ష్యంగా

# ఇందిరమ్మ క్యాంటీన్‌లు

### మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, నవంబర్ 28 (సమయం న్యూస్) :** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమంకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, డిప్యూటి మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్, కవాడిగూడలో ఇందిరమ్మ క్యాంటీన్లను జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ప్రారంభం అనంతరం మంత్రి, మేయర్, ఎంపీ, ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్,జీహెచ్ఎంసీ అధికారులు లబ్ధిదారులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, స్థానిక కార్పొరేటర్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మేడారం జాతరకు విస్తృత ఏర్పాట్లు

### అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రులు పొంగులేటి, సీతక్క, కొండా సురేఖ

**మేడారం/హైదరాబాద్, నవంబర్ 28 (సమయం న్యూస్):** ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మేడారం ఆదివాసీ గిరిజన జాతరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని మేడారంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేపట్టామని వీటిని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. మేడారం జాతర నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ ( సీతక్క), దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సీతక్క, ఎంపీ బలరాం నాయక్ తదితరులతో కలిసి వివిధ నిర్మాణ పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా ఆదివాసీ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ ఇలవేల్పులు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలున్న ప్రాంగణాన్ని లక్షలాది భక్తులు దర్శించుకునేందుకు వీలుగా మేడారంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మేడారం అభివృద్ధి పనుల్లో గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ఎటువంటి భంగం కలగకుండా ప్రతి నిర్మాణం, ప్రతి కట్టడాన్ని పూర్తిగా ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా, మేడారం జాతర పూజారులు, ఆదివాసీ పెద్దల సూచనలతో చేపడుతున్నామని చెప్పారు రెండేళ్లకోసారి జరిగే మహా జాతరతో పాటు ఏడాది పొడవునా అన్ని రోజుల్లో మేడారం వచ్చి గద్దెలను దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోందని భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కెఎస్ శ్రీనివాసరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానొత్ రవి చందర్ , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి , రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి మనోజ్ కుమార్ , మండల మాజీ అద్యక్షులు జాలపు అనంత రెడ్డి , జిల్లా నాయకులు , మండల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సత్తుపల్లిలో చర్చ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి



**ఖమ్మం , నవంబర్ 28 :( సమయం న్యూస్ )** స్థానిక కొమ్మేపల్లి కాలనీ లో శుక్రవారం నూతన చర్చ్ ను సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి ప్రారంభించారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో గల కొమ్మేపల్లి కాలనీ లో సింగరేణి సహకారం , సత్తుపల్లి నియోజకవర్గ రాగమయి దయానంద్ ప్రత్యేక కృషి, చొరవ తో నూతన చర్చ్ నిర్మాణం పూర్తి చేసుకున్న సందర్భంగా చర్చ్ ను ప్రారంభించిన ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మట్టా దయానంద్, సత్తుపల్లి మున్సిపల్ కమీషనర్ నరసింహ, సింగరేణి జిఎం ,సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్,సింగరేణి పి ఓ ప్రహ్లాద్, సింగరేణి అధికారులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సత్తుపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ తోట సుజలా రాణి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్, సీనియర్ నాయకులు ఉడతనేని అప్పారావు, చల్లగుళ్ల కృష్ణయ్య, కమల్ పాషా, కొమ్మేపల్లి కాలనీ, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, మహిళలు, చర్చ్ కమిటీ, కాలనీ ప్రజలు, పాల్గొన్నారు.

# నేటి తరానికి దిశానిర్దేశం చేసిన పూలే దంపతులు

- మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి లో పాల్గొని పూలమాలలు అర్పించిన నాయకులు



**పరిగి మున్సిపల్(మం)నవంబర్,28(సమయం న్యూస్) :** మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో మహాత్మ జ్యోతిరావు పూలే-సావిత్రిబాయి పూలే విగ్రహాల వద్ద పట్టణ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు ఘన నివాళులు అర్పించారు. సామాజిక న్యాయం, విద్యా సమానత్వం కోసం జీవితాన్ని అంకితమిచ్చిన మహానుభావులను స్మరించుకుంటూ స్థానిక నాయకులు పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ కరణం అరవింద్ రావు, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ భాస్కర్, బీసీ సంఘాల నాయకులు ముకుంద నాగేశ్వర్, మాజీ కౌన్సిలర్లు తాహెర్ అలీ, జాక్ రవికుమార్, కృష్ణ, వార్ల రవి, మౌలానా, ముకుంద శేఖర్, సీనియర్ నాయకులు ఆకారపు రాజు, బషీర్, సవ్య నాయక్, మీది గడ్డ శ్రీనివాస్, గౌస్, రాకేష్, వెంకటేష్, దుంపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పూలే దంపతుల ఆలోచనలు నేటి తరానికి దిశానిర్దేశకమని, సమాజ పురోగతికి వారి సిద్ధాంతాలు మార్గదర్శం కావాలని తెలిపారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్త గూడెం నవంబర్28( సమయం న్యూస్.):** డిసెంబర్ 2న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో భాగంగా కలెక్టర్ విశ్వవిద్యాలయంలో ని అన్ని విభాగాలను సంబంధిత శాఖల ఇంజనీరింగ్, రోడ్లు-భవనాలు, విద్యుత్, పోలీస్ శాఖ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, పనుల పురోగతి, భద్రతా చర్యలు, నిర్వహణ వంటి అంశాలపై అధికారుల నుండి వివరణలు కోరారు. శిలాఫలకం ఏర్పాటు, ఆవరణ అభివృద్ధి, అంతర్గత రోడ్ల మరమ్మత్తులు, సందర్శకుల కోసం ఏర్పాటు చేయాల్సిన మార్గదర్శక బోర్డులు, పార్కింగ్ స్థలాలు, స్టేజీ నిర్మాణం, విద్యుత్ సౌకర్యాల తనిఖీ వంటి అంశాలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, లోటుపాట్లు ఏవైనా ఉన్న వెంటనే సరిదిద్దాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ,ముఖ్యమంత్రి గారి పర్యటన అత్యంత ప్రాధాన్యత కలిగినది అని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలి. విశ్వవిద్యాలయం సుందరీకరణలో భాగంగా మొక్కలు నాటడం, ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, శానిటేషన్ ఏర్పాట్లు పూర్తి చేసి, ముఖ్యమంత్రి పర్యటన నాటికి ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. పర్యటన రూట్‌మ్యాప్ తుది రూపు, ట్రాఫిక్ సర్దుబాట్లు, అగ్నిమాపక చర్యలు, వైద్య బృందాల నియామకం, వీఐపి ప్రోటోకాల్ అమలు, వంటి అంశాలపై కూడా కలెక్టర్ ప్రత్యేక సూచనలు చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజు, మున్సిపల్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాల పరిశీలన

- రైతులకు వేగవంతమైన చెల్లింపులపై సూచనలు చేసిన జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్..





**కోస్గి మండలం, నవంబర్28(సమయం న్యూస్) :** వరి కోనుగోలు కేంద్రాలలో రైతులకు వేగవంతమైన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలం చెన్నారం, ముక్తి పాడ్ గ్రామాల వద్ద ఎఫ్ పి ఓ ద్వారా నిర్వహించబడుతున్న వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన కేంద్రాలలో కొనుగోలు జరుగుతున్న విధానం, రికార్డు నిర్వహణ, రైతులకు చెల్లింపులు, తేమ శాతం పరిశీలన తదితర అంశాల పైన సమీక్ష నిర్వహించారు. సక్రమంగా ధాన్యం కొనుగోలు జరగడంతో పాటు ప్రభుత్వం సూచించిన కొనుగోలు నియమాల ప్రకారం వరి స్వీకరణ కొనసాగించాలని ఆదేశించారు. రైతులకు అడ్డంకులు లేకుండా కొనుగోలు సజావుగా కొనసాగాలని సూచించారు. కొనుగోలు సమయంలో ప్రతి లావాదేవీని రిజిస్టర్లలో సంపూర్ణంగా నమోదు చేయాల సమయానికి పూర్తి చేసి వ్యవస్థలో అప్డేట్ చేయాలని అన్నారు. రైతులు తీసుకొచ్చే వరి పంటపై ప్రమాణాలు పాటించి కొనుగోలు చేయాలని, రైతులకు ధాన్యం బకాయిలు లేకుండా, చెల్లింపులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. తేమ శాతం,దుమ్ము,మిశ్రమ ధాన్యం స్థాయిలను ప్రమాణాల ప్రకారం పరిశీలించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతులతో మాట్లాడి, ప్రస్తుత కొనుగోలు పరిస్థితులు, ధరలు, ప్రమాణాలపై అవగాహన కలిగి ఉన్నారా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విదంగా ముక్తిపాడ్ గ్రామంలో విత్తన శుద్ధి,పంట నిర్వహణ పద్దతులు,జాగ్రత్తల పట్ల రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కోస్గి మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ,ఏఈఓ లు ప్రతినిధులు, మరియు రైతులు పాల్గొన్నారు.

# చర్ల ఆసుపత్రి సేవలకు ప్రశంశలు.

- ఏజెన్సీ ప్రాంతాల్లో టీవీవీపీ ఆసుపత్రులలో అద్భుతమైన సేవలు
- జిల్లా ఆసుపత్రుల సేవలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు
- హెల్త్ సెక్రటరీ ఆదేశాల మేరకు జిల్లాకి వచ్చి ప్రత్యేకంగా అభినందించిన టీవీవీపీ కమీషనర్ అజయ్ కుమార్



**చర్ల నవంబర్28( సమయం న్యూస్).:** ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ భద్రాద్రి జిల్లా లో ని టీవీవీపీ ఆసుపత్రులలో అద్భుతమైన సేవలు అందుతున్నాయని , జిల్లా కలెక్టర్ ప్రోత్సాహం తో DCHS డాక్టర్ రవి బాబు ,వివిధ ఆసుపత్రి సూపరింటెండెంట్ లు వారి సిబ్బంది చాలా కష్టపడి పనిచేస్తూ జిల్లా కి రాష్ట్ర స్థాయిలో గొప్ప పేరు తెస్తున్నారని, ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని టీవీవీపీ కమీషనర్ డాక్టర్ అజయ కుమార్ తెలిపారు. ఇటీవల చర్ల ఆసుపత్రి లో రెండు కిష్టమైన రోగులకు ఎంతో నేర్పుగా వైద్యం అందించి కోన ఊపిరి తో ఉన్న నెలలు నిండని కవల పిల్లలు ఉన్న గర్భిణి ని నార్మల్ డెలివరీ చేసి తల్లి తో పాటు 1.1kg బరువుతో పుట్టిన ఇద్దరు ఆడ శిశువులను కాపాడి అలాగే కిడ్నీ,కాలేయం, ఊపిరి తిత్తులు సరిగా పనిచేయక నలభై వేల తెల్ల రక్త కణాలు ఉండి కోన ఊపిరి తో ఉన్న ఒక డెబ్బై ఏళ్ల వృద్ధుడిని నాణ్యమైన వైద్యం అందించి కాపాడిన విషయం పలు జాతీయ వార్త పత్రికల్లో వచ్చిన సందర్భం లో మారు మూల ప్రాంతాల్లో సైతం అందుతున్న మెరుగైన వైద్య సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తు చర్ల సిబ్బంది ని అభినందిస్తూ తన సందేశం తెలపవాల్సినదిగా ఆదేశించగా టీవీవీపీ కమీషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ప్రత్యేకంగా భద్రాద్రి జిల్లా చేరుకుని జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మెరుగైన సేవలకు కారణమైన వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తో కలిసి పాల్వంచ లో గురువారం రాత్రి జరిగిన అభినందన కార్యక్రమంలో జ్ఞాపికలు అందజేసి హర్షం వ్యక్తంచేశారు .జిల్లాలో చర్ల తో పాటు మణుగూరు ,అశ్వారా వుపేట,ఎల్లందు ,భద్రాచలం ఆసుపత్రుల్లో సైతం అద్భుత మైన వైద్య సేవలు అందుతున్నాయని డెలివరీ సంఖ్య బాగా పెరిగిందని, స్పెషలిస్ట్ వైద్యుల సేవలు జిల్లా నలు మూలల అందు బాటులో ఉండడం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఆయన తెలిపారు. ఇటీవల వచ్చిన కేంద్ర బృందం సైతం ఇదే అభిప్రాయం వ్యక్తంచేసిందని చెప్పారు.ఏ జిల్లాలో ఈ స్థాయిలో సేవలు లేవని ఆ ఘనత భద్రాద్రి జిల్లాలో ఆసుపత్రులకే దక్కిందని అందుకు జిల్లా కలెక్టర్ అందిస్తున్న ప్రోత్సాహం, మద్దతు చాలా కీలకమని ఆయన వేదిక పై ఉన్న కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చర్ల లాంటి ప్రాంతాల్లో అమోఘమైన వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలుపుతూ ఇతర ప్రాంతాల్లో సైతం మంచి సేవలు అందిస్తున్న రని తనికి ప్రజల నుండి ప్రజాప్రతినిధుల నుండి గొప్ప ఫీడబాక్ ఉందని తెలిపారు. ఆసుపత్రుల అవసరాలకి నన్ను ఎప్పుడైనా సంప్రదించవచ్చని ఆయన సిబ్బందిని సూచించారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన సేవలు ఏజెన్సీ ప్రజలకు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ,జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తో పాటు డి సి ఎచ్ ఎస్ డాక్టర్ రవి బాబు,జిల్లాలోని వివిధ ఆసుపత్రుల సూపరింటెండ్లు, వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- పనుల ప్రగతిని పరిశీలించిన కలెక్టర్



**నిజామాబాద్, నవంబర్ 28 ( సమయం న్యూస్).:** ప్రజలకు రవాణా సదుపాయం మెరుగుపర్చేందుకు వీలుగా చేపడుతున్న రోడ్డు మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రధాన రహదారులకు మరమ్మతులు జరిపిస్తుండగా, క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద, బైపాస్ రోడ్డు మార్గంలో, డిచ్పల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై కొనసాగుతున్న రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయించాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతతో చేపట్టేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని, పది కాలాల పాటు ఈ పనులు ప్రజలకు ఉపయుక్తంగా నిలిచేలా మన్నికగా జరిపించాలని సూచించారు. కాగా, నిజామాబాద్ నగరంలో గోల్ హనుమాన్ నుండి పూసలగల్లి కి వెళ్ళే మార్గంలో రోడ్డు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్న ప్రాంతాలను సైతం కలెక్టర్ పరిశీలించారు. పనులను ఇంకనూ ప్రారంభించకపోవడం పట్ల ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, వారం, పది రోజుల అనంతరం తాను మరోమారు క్షేత్రస్థాయి పరిశీలన చేయడంతో పాటు పనుల ప్రగతిని సమీక్షిస్తానని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్ అండ్ బీ అధికారి ప్రవీణ్, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ రవీంద్ర సాగర్, ఇనాయత్ తదితరులు ఉన్నారు.

# దక్షణ భారత రాష్ట్ర ల ELISS యాప్ వర్క్ షాపు హైదరాబాద్ లో ప్రారంభం.



**హైదరాబాద్ నవంబర్28( సమయం న్యూస్). :** భారత ప్రభుత్వ మత్స్య, పశుసంవర్ధక మరియు పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ, తెలంగాణ రాష్ట్రంలో 28-29 నవంబర్ 2025న దక్షిణ మండల రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, లక్షద్వీప్ % తెలంగాణ నోడాల్ మరియు జిల్లా నోడల్ అధికారుల కోసం eLISS యాప్ సాఫ్ట్‌వేర్‌పై రెండు రోజుల శిక్షణ వర్క్‌షాప్‌ను ప్రారంభించింది. ఈ వర్క్‌షాప్‌ను తెలంగాణ ప్రభుత్వ వెటర్నరీ % పశుసంవర్ధక డైరెక్టర్ బి గోపి భారత ప్రభుత్వ మత్స్య, పశుసంవర్ధక మరియు పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ, పశువుల గణాంకాల విభాగం గణాంక సలహాదారు శ్రీ జగత్ హాజారికా సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం హైదరాబాద్ తెలంగాణలోని శిక్షణా సంస్థలో జరిగింది. ప్రారంభోపన్యాసంలో డైరెక్టర్ వెటర్నరీ % యానిమల్ హస్బెండరీ పశువుల గణాంక డేటా యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు మరియు భారత ప్రభుత్వం విధాన రూపకల్పనలో దాని ఉపయోగాన్ని ప్రస్తావించారు. గ్రామ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ నమూనా సర్వేల ద్వారా పొందిన డేటాను సంకలనం చేసి, తరువాత రాష్ట్ర, జాతీయ మరియు ప్రపంచ స్థాయిలో నివేదించబడుతుందని గణాంక సలహాదారు తెలియజేశారు. సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ప్రాచి మిశ్రా సాహు మాట్లాడుతూ ఈ డేటాను 2023%-%24 నుండి యాప్ సాఫ్ట్‌వేర్ ద్వారా దేశవ్యాప్తంగా డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్నారు.

# పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ జరగాలి

**● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**



**హవేలీ ఘనపూర్ నవంబర్28( సమయం న్యూస్).:** శుక్రవారం హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల రెండో రోజు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సాగేందుకు చర్యలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంగంనిబంధనలను కచ్చితంగా పాటించాలని, అభ్యర్థులకు సమాన అవకాశాలను కల్పించాలని, అలాగే నామినేషన్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, శాంతి యుత వాతావరణం ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణం స్పందిస్తూ సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మొదటి విడత నామినేషన్లకు 29వ తేదీ చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంటుందని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నామినేషన్ పత్రాలు అధికంగా ఉంచాలని, నామినేషన్లు వెంట వెంటనే స్కాన్ చేసి ఎన్నికల సంఘానికి పంపించేందుకు జి.పి.ఓ లను అదనపు సిబ్బందిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఖచ్చితమైన ధ్రువపత్రాలతో నామినేషన్ కేంద్రాలను సంప్రదించాలని, సహాయతకు హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని స్పష్టం చేశారు. అభ్యర్థి ఎన్నికల ఖర్చు వివరాల నమోదుకు ప్రత్యేక బ్యాంక్ ప్రారంభించాలని లావా దేవీలు కచ్చితంగా బ్యాంకు ఖాతా నుండి జరపాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల ప్రక్రియ సాఫీగా పూర్తి చేయాలి

**● జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఇచ్చోడ నవంబర్ 28( సమయం న్యూస్) :** గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇచ్చోడ మండలం కోకస్ మన్నూర్, సిరికొండ గ్రామపంచాయతీ, ఇంద్రవెల్లి మండలం ముత్నూర్, ఉట్నూర్ మండలం పులిమడుగు గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, అవసరమైన పత్రాలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులతో మాట్లాడిన కలెక్టర్ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ఈ నెల 29వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని, అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం ఎన్నికల నేపథ్యంలో ఉట్నూర్ ఎక్స్ రోడ్ వద్ద విధులు నిర్వహిస్తున్న స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ అధికారులను ఐటిడిఏ ఉట్నూర్ పీవో యువ రాజ్ మర్మాట్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. తహసిల్దార్లు రమేష్, తుకారాం, ప్రవీణ్ కుమార్, ఎంపీడీవోలు నరేష్, రాయిస్ ఉల్లా, జీవన్ రెడ్డి, రామ్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, రిటర్నింగ్ అధికారులు, SST బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

**● తొలి విడత గ్రామ పంచాయతీలకు జరుగనున్న ఎన్నికలలో రెండవ రోజు**



**మహబూబ్ నగర్ నవంబర్28( సమయం న్యూస్) :** రాజాపూర్,తిరుమలాపూర్ పంచాయతీ కార్యాలయంలలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు నామినేషన్ స్వీకరణ కేంద్రంలో సదుపాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై అతికించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఉన్నతాధికా రులను సంప్రదించాలని అన్నారురాజాపూర్ మండలంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో మరియు తిరుమలాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామంలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియలు పరిశీలించిన కలెక్టర్ విజయేందిర బోయి పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్ల వివరాలను, మరియు నామినేషన్ వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుంది. పక్కనే ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు.అంగన్వాడి లలో గర్భిణీలు,పిల్లలకు సక్రమంగా పౌష్టిక ఆహారం అందించాలని అన్నారువరి, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ రాజాపూర్ మండలం లో చెన్నవెల్లి గ్రామంలోని ఐ కె.పి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు.కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన ధాన్యం వెంటనే ఎప్పటికప్పుడు తేమశాతం చెక్ చేయాలనీ,తేమ శాతం వచ్చిన ధాన్యం తూకం వేసి కొనుగోలు చేయాలని ఆదేశించారు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు టాబ్ ఎంట్రీ లు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.కొనుగోలు చేసిన ధాన్యం ను వెంట వెంటనే లారీలలో లోడ్ చేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి సంబంధిత రికార్డులను పరిశీలించారు రాజాపూర్ మండలం తిరుమలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారుకొనుగోలు కేంద్రం లో కలెక్టర్ రైతులతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. మొక్కజొన్న సేకరణ కేంద్రంలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్న నిల్వల నాణ్యతను స్వయంగా పరిశీలించి, కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదా అనే అంశాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం ప్రమాణాలు సరిగ్గా పాటించబడుతున్నాయా లేదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అలాగే ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడా అన్ని వసతులను అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతులు తెచ్చిన పంటను నిల్వ చేయడంలో లేదా తరలించడంలో సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న ఆన్లైన్ వివరాల నమోదు ప్రక్రియను, రికార్డులను పరిశీలించారు. అనంతరం తిరుమలాపూర్ గ్రామంలో పెన్షన్ తీసుకునేందుకు వచ్చిన వికలాంగులు,వృద్ధులతో పింఛన్లు పంపిణీ పై ఆరా తీశారు.కలెక్టర్ వెంట మండల అధికారులు పాల్గొన్నారు

## మహిళా సమస్యలను శుక్రవారం జరిగే సభలో విన్నవించవచ్చు.

**● జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ.**



**కరీంనగర్ అర్బన్ నవంబర్28( సమయం న్యూస్) :** మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్ మండల్ కొత్తపల్లి సెక్టార్, రాజీవ్ గృహకల్ప, అంగన్వాడీ కేంద్రం లో శుక్రవారం సభ కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి హాజరైన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మేడం గారు మాట్లాడుతూ మహిళల తమ సమస్యలు ఏవైనా శుక్రవారం సభలో విన్నవించుకోవచ్చని. ప్రతి మహిళా గర్భిణీ బాలింత శుక్రవారం సభకు తప్పక హాజరు కావాలని సూచించారు సభలో పలు విషయాలు చర్చించుకోవడం ద్వారా మహిళల్లో మానసిక ఉత్తేజం కలుగుతుందని అన్నారు హెల్త్ సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది సభ ప్రభుత్వం శుక్రవారం సభకు హాజరవుతుందని దీనివల్ల సమస్య అప్పటికప్పుడే పరిష్కారం లభిస్తుందని అన్నారు.అంగన్వాడీ కేంద్రాలలో ప్రాథమిక విద్యతో పాటు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పిల్లలు సృజనాత్మకతను పెంపొందించే ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు.ప్రతి అంగన్వాడీ కేంద్రం లో బోర్డు ఏర్పాటు చేసారు అని మనం తోసుకొనే ఆహారం లో ఉండే వాళ్ళ వచ్చే అనారోగ్య సమస్య ల గురుంచి తెలిపారు. వెంకటరమణ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో జిల్లాలో మహిళలందరికీ సుమారు 50 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని వీటిని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్ష అందుబాటులో ఉంటుందని తెలిపారు.కార్యక్రమం చివరలో శ్రీమంతాలు,అన్నప్రాసన చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అర్బన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సరస్వతి,సీడీపీఓ సబిత, వెంకటరమణ,. అరుణ ,సతీష్, రాజేందర్ ప్రతం,అంగన్వాడీ టీచర్స్ గర్భిణీలు బాలింతలు కిశోర బాలికలు అంగన్వాడి టీచర్ మరియు ఆశా పాల్గొన్నారు

## ముసాయిదా విత్తన బిల్లు-2025 పై అభిప్రాయాల సేకరణ

**● ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ వెల్లడి**




**నిజామాబాద్, నవంబర్ 28 ( సమయం న్యూస్).** వ్యవసాయ శాఖ ద్వారా రూపొందించిన ముసాయిదా విత్తన బిల్లు -2025 పై శుక్రవారం అభిప్రాయ సేకరణ జరిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వ్యవసాయ అధికారులతో పాటు రైతు ప్రతినిధులు, విత్తన డీలర్లు, కంపెనీలు, విత్తన ఉత్పత్తిదారులతో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముసాయిదా విత్తన బిల్లులోని అంశాలపై చర్చించి వారి అభిప్రాయాలను సేకరించారు. ముసాయిదా బిల్లులో పొందుపర్చిన నాసిరకం విత్తనాల కారణంగా పంట ఉత్పత్తి, విక్రయ దశలో రైతులకు నష్టం కలిగితే నిర్ణీత కాల పరిమితితో రైతులకు చట్టబద్ధంగా నష్ట పరిషారం అందించేలా నిబంధనలపై చర్చించారు. విత్తన ఉత్పత్తి కార్యకలాపాలకు సంబంధించి స్పష్టమైన, సమర్ధవంతమైన నియంత్రణ వ్యవస్థను బిల్లులో చేర్చడం, పత్తి, వరి, పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, కూరగాయలు తదితర విత్తనాల ఉత్పత్తి, విక్రయ ధరల నియంత్రణ కోసం నిబంధనలు, విత్తన విక్రయదారుల లైసెన్సింగ్ వ్యవస్థ, మార్గదర్శకాలు, సీడ్ టెస్టింగ్, విత్తనాల దిగుమతి, విత్తన ప్రాసెసింగ్ యూనిట్ల నియంత్రణలో ఉన్న లోపాల సవరణ తదితర అంశాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. ముసాయిదా విత్తన బిల్లుపై సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## టీ-పోల్ మొబైల్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలి

**● కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**

**నిజామాబాద్, నవంబర్ 28( సమయం న్యూస్). :** స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల సౌలభ్యం కోసం అందుబాటులోకి తెచ్చిన టీ-పోల్ మొబైల్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. టీ-పోల్ యాప్ ద్వారా ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, ఓటరు స్లిప్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చని అన్నారు. అలాగే టి-యాప్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని కూడా తెలియజేయవచ్చని అన్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు ఎం.పీ.డీ.ఓలకు చేరుతాయని, వాటిని పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్లే స్టోర్ నుండి ఈ యాప్ ను https://play.google. com/store/apps/details?idRcom.cgg.gov.in.te_poll_teluguలింక్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.



25000 వేల లంచం తీసుకు ంటూ ఏసీబీ అధి కారులకు పట్టుబడిన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల ఎమ్మార్వో మహేందర్...

## ఆర్ ఓ కేంద్రాలు, ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ తనిఖీ చేసిన ఎన్నికల సాధారణ పరిశీలకులు



**రాజన్న సిరిసిల్ల, నవంబర్ - 28( సమయం న్యూస్).:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పలు ఆర్ఓ కేంద్రాలు, ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ జిల్లా సాధారణ పరిశీలకులు రవి కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లి, వట్టిమల్ల ఆర్ఓ కేంద్రాలు, ఫాజుల్ నగర్ ఎస్ఎస్ టీ, రుద్రంగి ఆర్ఓ, ఎస్ఎస్ టీ చెక్ పోస్ట్ ను తనిఖీ చేశారు. ఆయా ఆర్ ఓ కేంద్రాల్లో నామినేషన్లు, హెల్ప్ డెస్క్ ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ల్లో రికార్డ్స్ తనిఖీ చేశారు.కార్యక్రమంలో నోడల్ అధికారులు భారతి, ఎంపీడీఓ లు నటరాజ్, శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

## ఉమ్మడి జిల్లా జట్టుకు విద్యార్థుల ఎంపిక..

- సర్జఖాన్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు ఎంపిక-హెచ్ఎం శ్రీకృష్ణ గౌడ్




**కోస్గి మండలం, నవంబర్,28(సమయం న్యూస్) :** ఈ నెల 29,30,31లలో మహబూ బాబాద్ జిల్లాలోని డోర్నకల్ లో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్ 17 రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలకు నారాయణపేట జిల్లా కోస్గి మండలం సర్జఖాన్ పేట పాఠశాలకు చెందిన 10 వ తరగతి విద్యార్థిని చందన మరియు 9 వ తరగతి విద్యార్థి రాజు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకృష్ణ గౌడ్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ,జాతీయ స్థాయి పోటీలకు ఎంపికజరిగే విధంగా ప్రతిభ కనపరచాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు. క్రీడలలో మెళకువలు నేర్పించిన వ్యాయమ ఉపాధ్యాయుడు నర్సింహ్మా, ఉమామహేశ్వర రెడ్డి తదితరులు అభినందించారు.

## సర్పంచ్ గా గెలిపించండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా.

- పర్వేజ్ హైమద్.



**రాయపోల్, నవంబర్ 28:** మంతూరు గ్రామ ప్రజలు ఆదరించి తనను సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని పర్వేజ్ హైమద్ అన్నారు.శుక్రవారం రాయపోలు మండలం అనాజిపూర్ క్లస్టర్లో మంతూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా సుమారు 300 మంది మద్దతు దారులతో డప్పు దర్వులతో ర్యాలీగా తరలి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు తనకు సహాయ, సహకారాలు అందించి గ్రామ సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామంలో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.గ్రామ అభివృద్దె లక్ష్యంగా పనిచేస్తానని మంతూరు గ్రామ ప్రజలు అందరూ తమ అమూల్యమైన ఓటు వేసి సర్పంచ్ గా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నామన్నారు.

## బి ఆర్ ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీ లో చేరిక



**బాన్సువాడ, నవంబర్ 28 (సమయం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి నాయకత్వంలో బాన్సువాడ నియోజకవర్గంలో కీలక రాజకీయ చేరికలు చోటుచేసుకున్నాయి.బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్తలు జోగు నర్సింలు, పందుల సుధాకర్, గుడి కొండ సాయిలు, కొండు పందరి, తుకారాం, కమ్మరి బాబు, దుర్గయ్య, హన్మండ్లు, కొంద్ర రాములు, పోతురాజు రాజు, నిరుడి రాజు, లస్మాపురం దశరథ్ తదితరులు బాన్సువాడలోని నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో పోచారం భాస్కర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నందుకు పార్టీ మార్పు నిర్ణయం తీసుకున్నామని నాయకులు తెలిపారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు...

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొడంగల్ లో 2022-23మరియు 2023-24 సం. లకు అకాడమీ ఆడిట్

- ప్రిన్సిపాల్ డాక్టర్. బి.శ్రీనివాస్ రెడ్డి
- అకాడమిక్ అడ్వైజర్లుగా తాండూరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వసంత కుమారి
- చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ డా.యం. రమేష్ బాబు హాజరయ్యారు






**కొడంగల్ మున్సిపల్(మం)నవంబర్,28(సమయం న్యూస్)** ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోడంగల్ లో నేడు 2022-23 మరియు 2023-24 విద్యా సంవత్సరాలకు గాను అకాడమిక్ ఆడిట్ ను కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అకాడమిక్ అడ్వైజర్లుగా తాండూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వసంత కుమారి మరియు చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ డా. యం.రమేష్ బాబు హాజరైనారు. ఈ సందర్భంగా డా. వసంత కుమారి కళాశాలలో గల వసతులు, పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ అకడమిక్ ఆడిట్ విద్యా సంస్థల్లోని నాణ్యతను, ప్రమాణాలను సమగ్రంగా మూల్యాంకనం చేయడానికి ఉపయోగ పడుతుందని, దీని వల్ల బోధనా పద్ధతులు, పాఠ్యప్రణాళిక అమలు, పరిశోధన, పరిపాలన పనులు, సహపాఠ్య కార్యక్రమాలు వంటి వాటి పనితీరును అంచనా వేయడానికి, తగు సూచనలు ఇవ్వడానికి ఎంతగానో తోడ్పడుతుందని తద్వారా సంస్థాగత వృద్ధికి, విద్యార్థుల అభ్యసనను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అకాడమిక్ ఆడిట్ వల్ల కళాశాలకు ఎంతో మేలు జరుగుతుందని, తమ లోటు పాట్లను తెలుసుకోవడం ద్వారా ప్రమాణాల పెంపునకు ఎంతగానో తోడ్పడుతుందని, అడ్వైజర్స్ సూచనలను పాటించి కళాశాల అభ్యున్నతికి మరింతగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, అకాడమిక్ కోఆర్డినేటర్ టి. రాంబాబు, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమాలుపోరాటాలు త్యాగాలు బలిదానాలు మావి లబ్ధి పొందింది కేసీఆర్ కుటుంబం

- సీనియర్ అడ్వకేట్మహమ్మద్ జహీర్ అలీ



**ఖమ్మం , నవంబర్ 28 : ( సమయం న్యూస్ ):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 లో తెలంగాణ ఉద్యమం తో పాటు మలి తెలంగాణ ఉద్యమం లోకూడా పాల్గొని, అనేక ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాలు , బలిదానాలు ఉద్యమకారులు చేస్తే వారి శ్రమతో పడిన తెలంగాణ రాష్ట్రం ఫలాల లబ్ధి పొందింది కెసిఆర్ కుటుంబం అని సీనియర్ అడ్వకేట్ , 1969 తొలి తెలంగాణ ఉద్యమ నాయకులలో ఒకరు మహమ్మద్ జహీర్ అలీ మంగళవారంఒక ప్రకటనలోవిమర్శించారు. అనేకమంది ఉద్యమకారులు ఉద్యమాలు పోరాటాలు త్యాగాలు బలి దానాలతో తమ కుటుంబాన్ని , ఉద్యోగాలను , తమ భవిష్యత్తును ధారబోసి , ఆమరణ నిరాహార దీక్షలు తలపెట్టి , ప్రాణాలు అర్పిస్తే ,ప్రత్యేక రాష్ట్ర కల సాకారం చెందిందని జహీర్ అలీ తెలిపారు. నేడు దీక్షా దివస్ పేరుతో కెసిఆర్ ను ఆకాశానికి ఎత్తుతున్నారని , అందుకు కేసిఆర్ కి ఎలాంటి అర్హత లేదని దుయ్యబట్టారు. కెసిఆర్ దీక్ష లేకుంటే తెలంగాణ ప్రకటన లేదు.. అనటం , బిల్లులేదు , చట్టం లేదు , అనటం.. తెలంగాణ రాష్ట్రం సాధనలో అందరి కోసం ఒకడుగా నిలిచిన కెసిఆర్ అంటూ బుజకీర్తులు తగిలించడం హాస్యస్పదంగాను అవివేకంగానూ ఉందన్నారు. 1969 దశకం లోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రవీంద్రనాథ్ తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆమరణనిరాహార దీక్షద్వారా బలిదానం చేశారని గుర్తు చేశారు. కెసిఆర్ దీక్షఎలాంటిదో అందరికీ తెలిసిందేనని అన్నారు. దీక్షలు ఎలా చేయాలో ఆనాడు అమృతారావు , రవీంద్రనాథ్ యావత్ తెలంగాణ వాసులకు దిశా నిర్దేశం చేశారని , నేడుకెసిఆర్ దీక్షా దివస్ పేరుతో ... గతపది సంవత్సరాల పాటు అడ్డు , అదుపు లేకుండా చేసిన దోపిడీ నుదాచాలంటే కుదరదని స్పష్టం చేశారు. తెలంగాణ రాకముందు కెసిఆర్ , ఆయన కుటుంబ సభ్యులతో పాటు బంధు వర్గం సంపాదన , ఆస్తిపాస్తుల గణంకాలు చూస్తే తెలుస్తుందని , తెలంగాణని ఎంత కొల్లగొట్టారో , మిగులు తెలంగాణనిదిగులు తెలంగాణగా మార్చిన విషయం కూడా తెలుస్తుందని జహీర్ అలీ పేర్కొన్నారు. మాటల మంత్రాలతో 10 సంవత్సరాల పాటు పాలించిన కెసిఆర్ , తెలంగాణ రాష్ట్ర సాధనకు పాటుపడిన అమరవీరులకు , వారి కుటుంబాలకు ఎంత మేలు చేశాడో తెలంగాణ ఉద్యమ కార్యకర్తలను , నాయకులను అడిగితే తెలుస్తుందని ఎద్దేవా చేశారు. 10 ఏళ్ల తన పాలనలో కెసిఆర్ అన్ని వ్యవస్థలను వాడుకొని ,ఆస్తులనుకూడ బెట్టే కార్యక్రమాలు చేశారని , నేడువారి కుటుంబ కలహాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్న కొందరు మాత్రం కెసిఆర్ నుగుడు తూ ఉన్నారనిచెప్పారు. కెసిఆర్ కెసిఆర్ కుటుంబం వారి మంత్రులు ఎమ్మెల్యేలు ఆఖరికి వారి కార్పొరేటర్లు సైతంఏ విధంగా అక్రమ ఆర్జనకు తెగ బడ్డారో , ఎలా బెదిరింపులకు , దాడులకు దిగారోఇప్పటికీ తెలంగాణ ప్రజానీకం మరచి పోలేకపోతుందని తెలిపారు. సకలజనుల సమ్మెతో పాటు అనేక కార్యక్రమాలలో వెన్నుదన్నుగా నిలిచిన తెలంగాణ ఉద్యమకారులను , అమరవీరులను , అమరవీరుల కుటుంబాలనువిస్మరించి , తెలంగాణతెలంగాణ ద్రోహులకుఅందలం ఎక్కించినా తీరు తెన్నులునీతి నిజాయితీ ఎలాంటి వో ఉదాహరణగా నిలిచిపోతాయన్నారు. ఇక ఇలాంటి గారడి మాటలు ప్రజలు నమ్మరని , భవిష్యత్తులో మరోసారి అధికారంలోరావడంకష్టమేనని , మరో 20 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ యే పరిపాలన చేస్తుందని జహీర్ అలీ అన్నారు. మాటలు రాని , మాట్లాడలేని ఒక తోలుబొమ్మలా మహమ్మద్ అలీ ను ఉప ముఖ్యమంత్రి , హెూం శాఖ కేటాయించి , ముస్లిం మైనార్టీలకు ఏదో చేశారని భ్రమను , నాటకం ను తలపించారని , ఇది ముస్లింలకు , మహమ్మద్ అలీ కు లాలీపాప్ లాంటిదని ఎద్దేవా చేశారు . కెసిఆర్ పాలనలో కెసిఆర్ తో పాటు కేటీఆర్ కవిత హరీష్ లు పాలించిన విషయాన్ని ఎవరైనా విస్మరించగలరాఅంటూ జహీర్ అలీ ప్రశ్నించారు. తన పదేళ్లపాలనలో ముస్లిం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ల అంశాన్నిఅట కు.ఎక్కించిన నిజాన్ని గుండెల మీద చేయి వేసుకొని నిజమని ఒప్పుకుంటారా అని నీలదీశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలకు తగిన గౌరవం, మర్యాదలు లేవని ఆక్షేపించారు. తెలంగాణ రైతన్నసాయుధపోరాటాన్ని వక్రీకరిస్తూ తీసిన చిత్రాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవార్డు అందజేయడం సమంజసంగా లేదన్నారు. ఇలాంటి సమయంలోఆ పోరాటంలో పాల్గొనని ఆర్ఎస్ఎస్ నేటి బిజెపి నాయకులు హిందూ ముస్లిం ల యుద్ధంగా చరిత్రను మారుస్తున్నారని , సీఎం రేవంత్ రెడ్డివిధానాలు మతతత్వానికి పెంచుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గంగా జమున తేహేజిబ్ కు ఆలవాలమైనతెలంగాణ ప్రజానీకం ఇటువంటివిసహించరని , తిప్పి కొడతారని జహీర్ అలీ హెచ్చరించారు.

# ఈభూమి వారిదేవారికే ధారాదత్తం చేయండి

- లంబాడీల భూములస్వాధీనం తగదు
- కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మలనుటార్గెట్ చేయడం మంచిది కాదు
- లంబాడి జే ఏ సీ నాయకులు



**ఖమ్మం , నవంబర్ 28 :( సమయం న్యూస్ ):** ఈ భూమి వారిదే , వారికే ధారా దత్తం చేయండి అంటూ లంబాడి జేఏసీ నాయకులు బి. కిషన్ నాయక్ , జి . రాజేష్ నాయక్ , కేశవ్నాయక్ , బానోతు బద్రు నాయక్ , రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్నకరికంటే సంజీవరావు , మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్ద తండాలో గల136 లోనిభూమిని సందర్శించి , మాట్లాడారు. 1986 లో ప్రస్తుత ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి ఆనాటి రెవెన్యూ గ్రామ సరిహద్దుల్లో గలపెద్దతండ సర్వే నెంబర్ 136లో సుమారు రెండు ఎకరాలను ప్రభుత్వంబానోతు మంగమ్మ , ముత్యాలు , రమణి పేర్ల మీద పట్టాపాసుబక్కునుఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇది ఎలాంటి కబ్జా చేసింది కాదని , దీనిని రెవెన్యూ అధికారులు స్వాధీన పరచుకోవడం సమంజసం కాదన్నారు. ఇలాగే 2010 లోఒకసారి రెవెన్యూ అధికారులుఈభూమిని స్వాధీన పరుచుకునేందుకు ప్రయత్నించి , ఇది పట్టా జారీ చేసిన భూమిగా గుర్తించి , వెను తిరిగిన విషయాన్ని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన లంబాడీలను , వారి భూములను టార్గెట్ చేయడం ప్రభుత్వానికి మంచిది కాదని హితవు పలికారు. సుమారు రెండు సంవత్సరాల నుండి కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీల భూములను స్వాధీనం చేసుకునేందుకు ముందుకు పోతుందని , ఇప్పటికే అనేకమంది అమాయక లంబాడిలా భూములను స్వాధీనం చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతఎన్నికలలోసకల జనులతో పాటు లంబాడీలు కూడా కాంగ్రెస్ పార్టీ విజయానికి సహకరించారని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ కన్నముందు దివంగత ప్రధానమంత్రి జవహర్ లాల్నెహ్రూ కాలం నుండి యే లంబాడీలు అంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతుదరులుగా ఉన్నారని తెలిపారు. అలాంటి లంబాడీల భూములను టార్గెట్ చేస్తూ స్వాధీన పరుచుకునే ప్రక్రియ సరికాదన్నారు. ఇది ఇలాగే కొనసాగితే లగిడిచర్ల వంటి సంఘటనలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి ఆ భూమి వారిదే , వారికే ధారా ధత్వం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను తల పెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోనాయక్ , సాయికమార్ నాయక్ , బి. కృష్ణ నాయక్ , గడ్డి వీరన్న, భూక్యా రాంబాబునాయక్ ,సుశీల ,వీరన్న నాయక్ ,రవీంద్రనాయక్ , అజ్మీర కిషన్ నాయక్, మురళి నాయక్ ,బాధితులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి.

- ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు.
- నిర్భయంగా,ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా,భద్రతా ఏర్పాట్లపై అధికారులకు
- జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,ఐపీఎస్ దిశానిర్దేశం.




**వికారాబాద్, నవంబర్,28(సమయం న్యూస్) :** జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్ శుక్రవారం జిల్లాలోని పోలీస్ అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మూడు దశల్లో జరగనున్న ఎన్నికల ప్రక్రియ, భద్రతా ఏర్పాట్లు మరియు బందోబస్తుపై అధికారులకు ఆమె స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా 582 గ్రామాలలోని 608 పోలింగ్ లొకేషన్ లలో ఉన్న 4956 పోలింగ్ స్టేషన్ లలో ఎన్నికలు జరుగుతాయి అని,ఈ ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని ఎస్పీ సూచించారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున,నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడే వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, డబ్బు రవాణా జరిగే ఆస్కారం ఉన్నందున తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. ముఖ్యంగా ఎస్.ఎస్.టి మరియు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లను ముందుగానే గుర్తించి, అక్కడ అదనపు బలగాలను మోహరించాలని, నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలో శాంతికి విఘాతం కలిగించే పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, ఎలక్షన్ సస్పెక్ట్స్ మరియు అనుమానితులను గుర్తించి వారిని ముందుగానే బైండోవర్ చేయాలని ఆదేశించారు. అలాగే, గన్ లైసెన్స్ కలిగిన వ్యక్తుల నుండి వెంటనే ఆయుధాలను డిపాజిట్ చేసుకోవాలని స్పష్టం చేశారు. పోలీస్ అధికారులు తమ స్టేషన్ పరిధిలోని ప్రతి పోలింగ్ లొకేషన్‌ను స్వయంగా సందర్శించి భద్రతా పరమైన లోపాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు.ఎన్నికల విధుల పట్ల అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. పోలింగ్ సిబ్బందితో మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో పోలీస్ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రజలు ఎటువంటి భయం లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించడమే పోలీస్ శాఖ అంతిమ లక్ష్యమని ఎస్పీ స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, డిటిసి డీఎస్పీ శ్రీనివాస్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ డీఎస్పీ ఎన్.యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్,జిల్లా లోని పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ఖమ్మం జిల్లాలో గ్రామపంచాయతీ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

- తనిఖీ చేసిన సాధారణ ఎన్నికల పరిశీలకులు జిల్లా కలెక్టర్



**ఖమ్మం, నవంబర్ 28 : ( సమయం న్యూస్ ) :** ఎన్నికల నిబంధనల ప్రకారం అప్రమత్తంగా ఉంటూ విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు అన్నారు.శుక్రవారం రఘునాథపాలెం మండలంలో మొదటి విడత గ్రామ పంచాయతి ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిశీలించారు. చిమ్మపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కోటపాడు, చిమ్మపూడి, కోయచెలక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రేగులచెలక, కోయచెలక, శివాయిగూడెం గ్రామాల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ ప్రతాలను పరిశీలించారు. ఎన్నికల విధులు, బాధ్యతల పట్ల సంబ ంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు.ఈ సంద ర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు మాట్లాడుతూలి ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు చాలా ముఖ్యమైన ఘట్టమని, నామినేషన్ పత్రాలలో ప్రతి అంశం సరిగా ఉన్నాయో, లేవో జాగ్రత్తగా నిబంధనల ప్రకారం చూడాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ కు విధిగా కొత్త బ్యాంక్ ఖాతా తీసుకునే విధంగా వారికి తెలియజేయాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ఒరిజినల్ పత్రాలను సంబంధిత గ్రామ పంచాయతీలలోని ఆర్వో ల వద్ద పొందవచ్చని తెలిపారు. వార్డు సభ్యుడు పోటీ కోసం అదే వార్డు సభ్యుడు ప్రపోజర్ గా ఉండాలని అన్నారు. సర్పంచ్ గా పోటీచేసే అభ్యర్థి డిపాజిట్ క్రింద కేటగిరి వారిగా చెల్లించాలని, ఏమైనా అప్పీల్ ఉంటే ఆర్డీవోను సంప్రదించాలని సూచించారు.నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పిళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులకు సంబంధించిన కర పత్రాలు, గోడపత్రాలు, ప్రచార వాహనాల అనుమతులను తీసుకోవాలంటే సంబంధిత మండల అధికారులను సంప్రదించాలని తెలిపారు. గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యుల నామినేషన్ దాఖలును రోజు వారిగా ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. అభ్యర్థుల యొక్క అన్ని వివరాలు నామినేషన్ పత్రాలలో పూర్తిగా నమోదు చేసేందుకు అవగాహకు హెల్ప్ డెస్క్ లో నివృత్తి చేసుకోవచ్చని, ప్రతి చిన్న అంశాన్ని, అనుమానాలకు తావులేకుండా పూర్తి స్థాయిలో తెలుసుకోవాలని వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బందీగా ఎన్నికలు నిర్వహించుటకు అధికారులు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.సాధారణ ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్ వెంట రఘునాథపాలెం మండల తహసీల్దారు శ్వేత, లింగనాయక్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాచలం నవంబర్28( సమయం న్యూస్).:** భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో డిసెంబర్ 29న నిర్వహించు తెప్పోత్సవం, 30న నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం, కళ్యాణ మండపం, అధ్యయన వేదిక, క్యూ లైన్‌లు, భక్తుల కోసం సెక్టార్ వైజ్ ఏర్పాట్లు వంటి అంశాలపై దేవస్థానం అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు.మిథిలా స్టేడియం ఉత్తర ద్వారం ప్రాంతంలో క్యూ లైన్‌ల ఏర్పాటు, భక్తుల ప్రవేశ%–%నిష్క్రమణ మార్గాలు, భద్రతా బలగాల మోహరింపు, త్రాగునీరు, వైద్య సేవలు, శానిటేషన్, మొబైల్ టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలను కలెక్టర్ వ్యక్తిగతంగా పరిశీలించి అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చారు. భక్తులకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ, ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్షలాది మంది భక్తులు భద్రాచలానికి చేరుకునే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు పూర్తిస్థాయిలో, నిర్లక్ష్యం లేకుండా చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను సిద్ధంగా ఉంచాలని, వైద్య విభాగం 24 గంటలు అంబులెన్స్‌లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

ఉత్తర ద్వారం వద్ద బారికేడింగ్, క్యూ లైన్ కవర్లు, లైటింగ్, సీసీ కెమెరాలు, సమాచార ప్యానెల్స్ ఏర్పాటు వంటి పనుల పురోగతిని ఇంజినీరింగ్ విభాగం అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భద్రతా పరంగా పోలీసు విభాగం, దేవస్థానం విజిలెన్స్, శానిటరీ సిబ్బంది అన్ని విభాగాలు పరస్పర సహకారంతో పని చేయాలని ఆయన సూచించారు.భక్తులకు సులభ దర్శనం అందించడం ప్రధానం కావడంతో రెస్టింగ్ పాయింట్లు, మెడికల్ క్యాంపులు వంటి ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదని కలెక్టర్ హెచ్చరించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే సమయాల్లో అదనపు వాలంటీర్లు, సిబ్బంది మోహరించాలని సూచించారు.దేవస్థానం పరిసరాల్లో స్వచ్ఛత, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ ఏర్పాట్లు కూడా కీలకమని పేర్కొంటూ, పంచాయతీ శాఖతో దేవస్థానం అధికారులు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విభాగం రోజువారీ పురోగతి నివేదికను సమర్పించి, నిర్ణీత గడువులో అన్ని పనులు పూర్తిచేయాలని ఆయన ఆదేశిం చారు. ఎటువంటి విభాగం నిర్లక్ష్యం చూపకూడదని హెచ్చరిస్తూ, భక్తుల సౌకర్యం దృష్టిలో ఉంచుకుని మొత్తం ఏర్పాట్లను అత్యుత్తమంగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె. దామోదర్ రావు, ఇంజినీరింగ్ విభాగం ఈఈ వి. రవీంద్రనాథ్, ఏఈఓలు శ్రవణ్ కుమార్, భవానీ, రామకృష్ణారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## నారాయణపేట జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది



జిల్లా కలెక్టర్ -సిక్తా పట్నాయక్

**నారాయణపేట, నవంబర్,28(సమయం న్యూస్) :** గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ 25.11.2025 తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిందనీఆ తేదీ నుండి నారాయణపేట జిల్లాలోని అన్నీ గ్రామ పంచాయితీల పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిందనీ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ తెలిపారు. అందువల్ల, జిల్లాలోని ఏ గ్రామ పంచాయితీ పరిధిలోనైనా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరిగితే, దయచేసి జిల్లా కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 08506-283122జిల్లా కలెక్టర్ మరియు -జిల్లా ఎన్నికల అథారిటీ, నారాయణపేట జిల్లా.

## 'పరిశుభ్రత - హరిత విద్యాలయ రేటింగ్'లో బోర్లం జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఐదు నక్షత్రాలు



**బాన్సువాడ, నవంబర్ 28 (సమయం న్యూస్) :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోర్లం విశిష్ట ప్రగతిని సాధించింది. కేంద్ర విద్యా శాఖ నిర్వహించిన లి'పరిశుభ్రత – హరిత విద్యాలయ రేటింగ్ 2025'లిలో పాఠశాల 94.40 శాతం మార్కులతో ఐదు నక్షత్రాల రేటింగ్ను అందుకుంది. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లాలో రెండో స్థానంను పొందుతూ ప్రత్యేక గుర్తింపు పొందింది.ఈ విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగవాన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. వెంకట రమణకు ప్రశంసాపత్రం అందించి అభినందనలు తెలిపారు.పాఠశాలలో పరిశుభ్రత నిర్వహణ, పచ్చదనం పెంపుదల, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన తాగునీరు, వ్యర్థాల సరైన నిర్వహణ వంటి అంశాల్లో అనుసరిస్తున్న ఉన్నత ప్రమాణాలకు ఈ రేటింగ్ నిదర్శనం.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, శారీరక విద్య ఉపాధ్యాయులు శ్రావణ్ కుమార్, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మీడియా సెంటర్ ను ప్రారంభించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య .



**సంగారెడ్డి ,నవంబర్ 28 ( సమయం న్యూస్) :** గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టరేట్ లోని డి పి ఆర్ ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ)ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసిఎంసి విధుల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, సకాలంలో ప్రచార ప్రకటనలకు సంబంధించిన అనుమతులు మంజూరు చేయాలని ఆమె సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను గమనిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి మీడియా సహకరించాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎం సి ఎం సి కమిటీ సభ్యులు, డి పి ఆర్ ఓ, విజయలక్ష్మి, అడిషనల్ పి ఆర్ ఓ ఏడుకొండలు,మీడియా ప్రతినిధులు,డి పి ఆర్ ఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బల్దియా పరిధి 48 వ డివిజన్ లో స్టాంప్ డ్యూటీ నిధులు రూ.107 లక్షల అంచనా వ్యయం తో నిర్మించతలపెట్టిన సి సి రోడ్,డ్రైన్ ల నిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక వరంగల్ (పశ్చిమ)శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేసిన నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి.... ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ సర్తాజ్ బేగం. మాజీ కార్పొరేటర్ అబూ బాకర్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రధానితో భారత అంధుల క్రికెట్ జట్టు

టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత అంధుల క్రికెట్ జట్టు గురువారం ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారత జట్టును ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అభినందించారు. ఆటోగ్రాఫ్స్ చేసిన బ్యాట్‌ను ఈ సందర్భంగా భారత్ బృందం ప్రధానికి బహుమతిగా అందజేసింది. జట్టు సభ్యులకు ప్రధాని స్వీట్లు తినిపించడంతో పాటు ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. ఆరు దేశాలు పోటీపడిన ప్రపంచకప్‌లో ఫైనల్లో నేపాల్‌ను ఓడించి భారత్ ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ జట్టుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దీపిక సారథ్యం వహించింది. సత్యసాయి జిల్లా అమరాపురం మండలం తంభాలట్టికి చెందిన దీపిక.. ప్రపంచకప్ విజయంతో ప్రధానిని కలుసుకుంది. తమ జట్టు సాధించిన ట్రోఫీని ప్రధాని నరేంద్ర మోదీకి చూపించింది. ఈ సందర్భంగా సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఇష్టాగోష్ఠిలో దీపిక, పాడేరు యువ క్రికెటర్ కరుణ కుమారి.. మోదీతో మాట్లాడారు. దీపిక పాటలు బాగా పాడుతుందని తెలిసి ఆమెను మోదీ ఒక పాట పాడాలని కోరారు. దాంతో దీపిక శివుని భక్తి గీతం పాడగా.. ఆమెను మోదీ అభినందించారు. కొన్ని క్రికెట్ బంతులపై జట్టు సభ్యులు మోదీ సంతకాలు తీసుకున్నారు.

## గంభీర్‌కు మూడు నెలలు డెడ్‌లైన్!!



సౌతాఫ్రికాతో టీమ్ఇండియా టెస్టు సిరీస్ వైట్ వాష్ అయిన కారణంగా కోచ్ గౌతమ్ గంభీర్ భవితవ్యంపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. గతేడాది ఇదే క్రమంలో స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లోనూ భారత జట్టు వైట్ వాష్‌కు గురయ్యింది. ఇప్పుడు మరోసారి అదే పరిస్థితి రావడంతో గౌతమ్ గంభీర్‌పై బీసీసీఐ సమీక్ష నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే ఇదే విషయమై కోచ్ గౌతమ్ గంభీర్‌పై తీవ్ర ఒత్తిడి ఉంది. వైట్ బాల్ మ్యాచ్‌ల సమయంలో టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌లను సమీక్షించాలని బీసీసీఐ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం గౌతమ్ గంభీర్ కోచ్ పదవికి ఎలాంటి ఆటంకం లేదని సమాచారం. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ తర్వాత టీమ్ఇండియాలో బ్యాటింగ్ బలహీనతలు బయటపడ్డాయి. స్పిన్ పిచ్‌లపై ప్రస్తుత బ్యాటింగ్ లైనప్ ఇబ్బందులు పడినట్లు విమర్శలు వస్తున్నాయి. అదే విధంగా గంభీర్ ఇటీవల చేసిన ప్రకటన పట్ల బీసీసీఐ సంతోషంగా లేనట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ప్రస్తుతం అయితే అతని పదవికి ఎలాంటి ఢోకా లేదని తెలుస్తోంది. అయితే, భారత ప్రధాన కోచ్ గంభీర్ వ్యూహాత్మక నిర్ణయాలు %దీజజ×% అధికారులకు అస్సలు నచ్చలేదు. సాయి సుదర్శన్ స్థానంలో కోల్‌కతాలో నంబర్ 3 స్థానంలో వాషింగ్టన్ సుందర్‌ని నియమించాలని గంభీర్ నిర్ణయం ఇప్పుడు వివాదాస్పదమైంది. సుదర్శన్, కరుణ్ నాయర్, సర్ఫరాజ్ ఖాన్ వంటి ఆటగాళ్లను స్పష్టమైన కారణం లేకుండా జట్టులో మార్పులు చేసినట్లు తేలింది. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండవ, చివరి టెస్ట్ కోసం గాయపడిన శుభ్‌మన్ గిల్ స్థానంలో సర్ఫరాజ్, కరుణ్, రుతురాజ్ గైక్వాడ్‌లను తీసుకోవాలని సూచించారని చెబుతున్నారు. కానీ గౌతమ్ గంభీర్ దేవ్‌దత్ పడిక్కల్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే ఎడమచేతి వాటం ఉన్న జట్టులో పడిక్కల్‌ను చేర్చడం వల్ల చివరికి జట్టు నిర్వహణ ధ్రువ్ జురెల్‌ను 4వ స్థానంలో ఉంచింది. నితీష్ కుమార్ రెడ్డి ప్లేయింగ్ %శ×%లోకి తిరిగి వచ్చారు. నితీష్ ఆడిన మూడు టెస్ట్‌లలో అతని పాత్ర అస్పష్టంగానే ఉంది. అయితే కోచ్ గౌతమ్ గంభీర్ భవితవ్యం మాత్రం రాబోయే టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఫలితంపై ఆధారపడి ఉంటుందని మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. కోచ్ గంభీర్ సహా చీఫ్ సెలెక్టర్ అగార్కర్ నుండి వ్యూహాత్మక తప్పిదాలు, పేలవమైన ప్రణాళికకు మార్పు కోసం డిమాండ్స్ వస్తున్నాయి. 2026 ఐసీసీ టీ20 ప్రపంచ కప్ అనుకున్నట్లుగా జరగకపోతే.. గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్ ఇద్దరూ ఉద్వాసనకు గురయ్యే అవకాశం ఉందని అనేక మీడియా నివేదికలు నివేదించాయి. వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచకప్ టోర్నీని భారత్, శ్రీలంక వేదికగా నిర్వహించనున్నారు.

## ఒకే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ రెండుసార్లు ఔట్..

సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ 2025 గ్రూప్ సిలో హర్యానా వర్సెస్ పంజాబ్ మధ్య ఉత్కంఠభరితమైన మ్యాచ్ జరిగింది. అభిషేక్ శర్మ కెప్టెన్సీలోని పంజాబ్ టోర్నమెంట్‌లో ఓడిపోయింది. అభిషేక్ శర్మ ఆటతీరు కూడా పేలవంగా మారింది. హర్యానా బౌలర్ చేతిలో రెండుసార్లు అవుట్ అవ్వడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. మ్యాచ్ ఉత్కంఠ తారాస్థాయికి చేరుకుంది. దీంతో ఫలితం సూపర్ ఓవర్‌కు దారితీసింది. ఈ మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్‌గా అభిషేక్ శర్మ పూర్తిగా విఫలమయ్యాడు. మ్యాచ్ గెలవడానికి 208 పరుగుల టార్గెట్ ఉంది. కానీ, ప్రతిస్పందనగా, అతను 5 బంతుల్లో 6 పరుగులు మాత్రమే అందించగలిగాడు. బౌలర్ అన్షుల్ కాంబోజ్‌కు బలి అయ్యాడు. చెన్నై సూపర్ కింగ్స్ (%జూఖ%) స్టార్ బౌలర్ అన్షుల్ కాంబోజ్ అతన్ని క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో హర్యానా విజయంలో అన్షుల్ కాంబోజ్ కూడా అతిపెద్ద హీరో. ఈ ఇద్దరు ఆటగాళ్ళు మరోసారి సూపర్ ఓవర్‌లో ఒకరినొకరు ఎదుర్కొన్నారు. ఈసారి కూడా అన్షుల్ కాంబోజ్ మ్యాచ్ గెలిచాడు. సూపర్ ఓవర్‌లో అభిషేక్ ఖాతా తెరవడానికి కూడా అన్షుల్ కాంబోజ్ అనుమతించలేదు. అతన్ని పెవిలియన్‌కు పంపాడు. అంటే అన్షుల్ కాంబోజ్ ఒకే మ్యాచ్‌లో అభిషేక్‌ను రెండుసార్లు అవుట్ చేయగలిగాడు. ఈ మ్యాచ్‌లో రెండు జట్లు ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన హర్యానా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. కెప్టెన్ అంకిత్ కుమార్ కేవలం 26 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 51 పరుగులు చేసి అదరగొట్టాడు. నిశాంత్ సింధు కూడా 32 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 61 పరుగులు చేశాడు. అదే సమయంలో, పంజాబ్ తరపున అశ్విని కుమార్ అత్యధికంగా 3 వికెట్లు పడగొట్టాడు. 208 పరుగులకు ప్రతిస్పందనగా, పంజాబ్ కూడా అద్భుతమైన బ్యాటింగ్‌ను ప్రదర్శించింది. అన్మోల్‌ప్రీత్ సింగ్ 37 బంతుల్లో 81 పరుగులు చేసి జట్టును విజయానికి దగ్గరగా తీసుకువచ్చాడు. ఇంతలో, సన్వీర్ సింగ్ 16 బంతుల్లో 30 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కానీ, జట్టు విజయాన్ని చేరుకోలేకపోయింది. దీనికి ప్రధానంగా అన్షుల్ కాంబోజ్ బౌలింగ్ కారణం. అన్షుల్ కాంబోజ్ 4 ఓవర్లలో 26 పరుగులకు 2 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత సూపర్ ఓవర్ ఆడగా, అన్షుల్ కాంబోజ్ 3 బంతుల్లో 1 పరుగు ఇచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. దీనికి ప్రతిస్పందనగా, హర్యానా మొదటి బంతికే ఫోర్ కొట్టి మ్యాచ్‌ను గెలుచుకుంది.



# వన్డే సిరీస్‌కు సిద్ధమైన టీమిండియా

**సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్**

**నవంబర్ 30న రాంచీ వేదికగా తొలి వన్డే**

**బరిలో దిగనున్న రోహిత్ శర్మ, కోహ్లీ**

**సచిన్, ద్రవిడ్ రికార్డుపై ఇరువురి కన్ను!**



సౌతాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడేందుకు టీమ్ఇండియా సిద్ధమైంది. ఈ సిరీస్‌లో మూడు వన్డేలు ఆడాల్సి ఉంది. ఇందులో భాగంగా ఆదివారం (నవంబర్ 30) రాంచీ వేదికగా తొలి వన్డే మ్యాచ్ ఉంది. ఈ మ్యాచ్‌లో సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ బరిలో దిగనున్నారు. ఈ క్రమంలో అభిమానుల అందరి దృష్టి వాళ్లపైనే ఉంది. ఈ స్టార్లిద్దరూ ఈ సిరీస్‌లో ఏ రికార్డులు నెలకొల్పుతారా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో రో-కో తొలి మ్యాచ్‌లోనే ఓ అరుదైన ఘనత దక్కించుకోనున్నారు. భారత క్రికెట్‌లో దిగ్గజాలు సచిన్ తెందుల్కర్, రాహుల్ ద్రవిడ్ అనేక మ్యాచ్‌ల్లో జట్టును గెలిపించారు. ఈ ఇద్దరూ జట్టు తరపున అనేక భారీ భాగస్వామ్యాలు నెలకొల్పారు. అంతర్జాతీయ క్రికెట్?లో వీరిద్దరూ జోడీగా భారత్ తరపున 391 మ్యాచ్‌లు ఆడారు. వీళ్లిద్దరి తర్వాత రోహిత్- విరాట్ జోడీ అత్యంత సక్సెస్‌ఫుల్ జోడీగా పేరుతెచ్చుకుంది. సచిన్- ద్రవిడ్ రిటైరైన తర్వాత రో-కో జోడీనే టీమ్ఇండియాకు వెన్నుముకలా నిలబడింది. ఈ ఇద్దరూ అనేక మ్యాచ్‌ల్లో కీలక ఇన్నింగ్స్ ఆడి భారత్‌ను గెలిపించారు. అయితే టీమ్ఇండియా క్రికెట్ చరిత్రలో రోహిత్ శర్మ, కోహ్లీ జోడీ కూడా ఇప్పటిదాకా 391 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడారు. రాంచీ వన్డేలో ఈ ఇద్దరూ క్రీజులో ఉంటే చాలు వీళ్ల మ్యాచ్‌ల సంఖ్య 392 అవుతుంది. దీంతో సచిన్- ద్రవిడ్ రికార్డ్ బ్రేక్ అవుతుంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ చరిత్రలో మరే ఇతర జోడీ కూడా ఇన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడలేదు. ఇక ప్రస్తుతం యాక్టీవ్‌గా ఉన్న ప్లేయర్లలో విరాట్ - రవీంద్ర జడేజా ఇప్పటివరకు టీమ్ఇండియా తరపున 309 అంతర్జాతీయ మ్యాచుల్లో జోడీగా ఆడారు. తొలి వన్డే కోసం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే రాంచీకి చేరుకున్నారు. నెట్స్‌లో ప్రాక్టీస్ కూడా మొదలు పెట్టేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గతనెల ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లో అదరగొట్టినట్లే, సౌతాఫ్రికాపై కూడా రఫ్ఫాడించాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. కాగా, రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడడంతో ఈ సిరీస్‌లో కే ఎల్ రాహుల్ భారత్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ వన్డేకు యంగ్ ప్లేయర్లు తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, ధ్రువ్ జురెల్ ఎంపికయ్యారు. ఇక రోహిత్ శర్మతో కలిసి యశస్వీ జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ఆరంభించే అవకాశాలు ఉన్నాయి.

**సౌతాఫ్రికాతో వన్డే సిరీస్?కు భారత్ జట్టు**


రోహిత్ శర్మ, యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, కేఎల్ రాహుల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్, ప్రసిధ్ కృష్ణ, అర్షదీప్ సింగ్, ధ్రువ్ జురెల్

## భారత్, శ్రీలంక టీ20 సిరీస్‌కు షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ

నవంబర్ 2న విశ్వవిజేతలుగా నిలిచిన భారత మహిళల క్రికెట్, ఇక వచ్చే ఏడాది జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌పై కన్నేసింది. ఈ క్రమంలోనే భారత్ మహిళల జట్టు మళ్లీ ఎప్పుడు బరిలోకి దిగుతుంది. ఎవరితో ఏ సిరీస్‌లో ఆడనుందో అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వచ్చే నెల భారత్ మహిళల జట్టు, శ్రీలంకతో టీ20 సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ కోసం శ్రీలంక మహిళల క్రికెట్ జట్టు భారత్ పర్యటనకు రానుంది. ఈ టూర్‌లో 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఉండనుంది. ఈ సిరీస్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోనే టీమ్ఇండియా బరిలోకి దిగనుంది. తాజాగా బీసీసీఐ ఈ సిరీస్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇందులో రెండు మ్యాచ్‌లు తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ విశాఖపట్టణం వేదికగా జరగనుండడం లోకల్ ఫ్యాన్స్‌కు కిక్ ఇచ్చే విషయం. ఇక త్వరలోనే ఈ సిరీస్‌కు సంబంధించిన జట్టును కూడా బీసీసీఐ ప్రకటించే ఛాన్స్ ఉంది. డిసెంబర్ 21న ఈ సిరీస్ ప్రారంభం కానుంది. తొలి రెండు మ్యాచ్?లు డిసెంబర్ 21, 23 తేదీలలో విశాఖపట్నంలో జరుగుతాయి. దీని తర్వాత డిసెంబర్ 26, 28, 30 తేదీలలో తిరువనంతపురంలో చివరి మూడు టీ20 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సిరీస్‌తో మరోసారి అభిమానులకు టీమ్ఇండియా మహిళా క్రీడాకారుల ఆటను చూసే అవకాశం ఉంది. శ్రీలంకపై భారత్‌కు మంచి రికార్డు ఉంది. ఇప్పటిదాకా ఇరుజట్ల మధ్య 26 మ్యాచ్‌లు జరగ్గా అందులో భారత్ 20 విజయాలతో సూపర్ ట్రాక్ రికార్డును కలిగి ఉంది. శ్రీలంక చివరిసారిగా భారత్‌ను 2014లో ఓడించింది. ఇక రీసెంట్‌గా వరల్డ్‌కప్ నెగ్గిన జోష్‌లో ఉన్న టీమ్ఇండియా, స్వదేశంలో జరగనున్న ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు. కాగా, ఈ సిరీస్ వచ్చే ఏడాది జరగనున్న మహిళల టీ20 వరల్డ్‌కప్‌నకు సన్నద్ధంగా ఉపయోగపడుతుంది. 2026 జూన్ 12న పొట్టి కప్ టోర్నీ ప్రారంభం కానుంది. ఈ ఈవెంట్‌కు ఇంగ్లాండ్ ఆతిథ్యం ఇవ్వనుంది.

## మంధాన తండ్రి కోలుకోగానే పలాశ్‌తో వివాహం

**పలాశ్ తల్లి అమిత ముచ్చల్ వెల్లడి**



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన- పలాశ్ ముచ్చల్ పెళ్లిపై గందరగోళం నెలకొంది. ఈనెల 23న ఈ పెళ్లి జరగాల్సి ఉండగా, ఆ రోజు స్మృతి తండ్రి శ్రీనివాస్ అనారోగ్యానికి గురవ్వడంతో వాయిదా పడింది. ఆ తర్వాత వరుడు పలాశ్ కూడా అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరడం, అతడు ఇంకో అమ్మాయితో క్లోజ్ ఎఫైర్స్ ఉన్నాయని ఆరోపణలు ఎదుర్కోవడంతో అభిమానులు కన్ఫ్యూజన్‌కు గురయ్యారు. దీంతో వీళ్ల పెళ్లి గురించి ఆందోళన నెలకొంది. తాజాగా దీనిపై పలాశ్ తల్లి అమిత ముచ్చల్ స్పందించారు. స్మృతి- పలాశ్ పెళ్లి వ్యవహారంలో అనేక రూమర్స్ వస్తున్న వేళ వరుడి తల్లి అమిత ఈ సస్పెన్స్‌కు తెరదించారు. అతి త్వరలోనే వాళ్ల పెళ్లి జరుగుతుందని క్లారిటీ ఇచ్చారు. స్మృతి తండ్రితో పలాశ్‌కు మంచి అనుబంధం ఉందని అందుకే తాము పెళ్లి వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. ఆయన పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి వచ్చిన తర్వాత పెళ్లి ఉంటుందని తెలిపారు. పెళ్లి వేడుకలకు కుటుంబ సభ్యులంతా మానసికంగా, శారీరకంగా రెడీగా ఉండాలని పలాశ్ కోరుకుంటున్నట్లు ఆమె వివరించారు. స్మృతి తండ్రి ఆరోగ్యం పట్ల తమ కుమారుడికి ఉన్న శ్రద్ధ గౌరవాన్ని ప్రదర్శిస్తుందని, తాను ఫ్యామిలీకి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నాడో తెలుపుతుందని చెప్పారు. 'మంధాన తండ్రి కోలుకోగానే స్మృతి- పలాశ్ వివాహం ఉంటుంది. ఆమెను తన భార్యగా ఇంటికి తీసుకొచ్చేందుకు పలాశ్ అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. మేం కూడా వాళ్లకు స్వాగతం పలికేందుకు ఉత్సాహంగా ఉన్నాం. ఆ స్పెషల్ డే కోసం వాళ్లిద్దరూ ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం అంతా బాగానే ఉంది. త్వరలోనే ఇరుకుటుంబాలు, సన్నిహితుల సమక్షంలో స్మృతి- పలాశ్ పెళ్లి గ్రాండ్?గా జరుగుతుంది' అని అమిత పేర్కొన్నారు. మహారాష్ట్ర సాంగ్లీలో ఓ ఫామ్‌హౌస్‌లో స్మృతి- పలాశ్ పెళ్లి వేడుకలు, సంగీత్, హల్దీ, మెహందీ ఈవెంట్లు గతవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు మహిళా క్రికెటర్లు హాజరై సందడి చేశారు. కాబోయే భర్త పలాశ్‌తో స్మృతి డ్యాన్స్ స్టెప్పులు వేసింది. ఈ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆమె స్వయంగా తన ఇన్?స్టాగ్రామ్?లో పోస్ట్ చేసింది. అవి వైరల్ అయ్యాయి. అయితే తండ్రి అనారోగ్యం పాలవ్వడం, పెళ్లి పోస్ట్?పోన్ కావడంతో ఆమె ఈ వేడుకలు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియా నుంచి తొలగించింది. చాటింగ్ స్క్రీన్‌షాట్లు వైరల్‌ఆ తర్వాత స్మృతిని కించపరుస్తూ పలాశ్ ఇంకో అమ్మాయితో చాట్ చేస్తున్నట్లు ఆరోపిస్తున్న చాటింగ్ స్క్రీన్ షాట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో అతడు స్మృతిని చీట్ చేస్తున్నాడంటూ నెటిజన్లు కామెంట్ చేశారు. కానీ దీనిపై ఇరు కుటుంబాలు కూడా స్పందించలేదు. స్మృతి పెళ్లి వాయిదా పడడంతో ఆమె స్నేహితురాలు, క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని బ్రిస్బేన్ హీట్ జట్టు వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో స్మృతికి మద్దతుగా ఉండేందుకు ఆమె బిగ్?బాష్?లో ఆడడం లేదు.



# స్పిరిట్ షూట్‌లో ప్రభాస్ బిజీ

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్' షూటింగ్ మొదలైంది.స్పిరిట్' కోసం రంగంలోకి దిగారు కథానాయకుడు ప్రభాస్. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ముస్తాబవుతున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రి కథానాయిక. ఇటీవలే లాంఛనంగా మొదలైన ఈ సినిమా హైదరాబాద్‌లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకుంది. దీనికోసం ప్రభాస్ గురువారం సెట్‌లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం ఆయనపై ఓ భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో ఈ షూట్ నిర్విరామంగా కొనసాగనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా భారీ హంగులతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనుంది. ప్రభాస్ ఇందులో శక్తిమంతమైన ఐపీఎస్ అధికారిగా సరికొత్త లుక్‌తో కనువిందు చేయనున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. హీరో ప్రభాస్ శుక్రవారం నుంచి నేరుగా 'స్పిరిట్' సెట్స్‌లో జాయిన్ అయ్యారు. ప్రభాస్ తన షెడ్యూల్‌లో భాగంగా డిసెంబర్ నెలాఖరు వరకు హైదరాబాద్‌లో తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేయనున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత, చిత్ర బృందం న్యూ ఇయర్ విరామం తీసుకోనుంది. కొత్త సంవత్సరం ప్రారంభంలోనే 'స్పిరిట్' చిత్ర యూనిట్ అంతా విదేశాలకు పయనం కానుంది. సినిమా రెండో షెడ్యూల్ వచ్చే ఏడాది ప్రారంభంలో మెక్సికోలో మొదలుకానుంది. మెక్సికోలో చిత్రీకరించే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తనదైన మార్కుతో ఈ చిత్రాన్ని ఎలా రూపొందిస్తారనే దానిపై ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.



# మీ అభిమానాలే నన్నునిలబెట్టాయి: నవీన్




టాలీవుడ్‌లో తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో నవీన్ పోలిశెట్టి మళ్లీ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధమయ్యాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో కెరీర్‌కు బ్రేక్ రాగా, ఆ తర్వాత వచ్చిన 'జాతిరత్నాలు'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఇటీవల అనుష్కతో చేసిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' కూడా మంచి విజయం సాధించడంతో ఆయన స్టార్ ఇమేజ్ మరింత పెరిగింది. ఇప్పుడీ క్రమంలో తన నాలుగో సినిమాగా 'అనగనగా ఒక రాజు'ని తెరపైకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నాడు. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించిన కొద్ది రోజులకే జరిగిన ప్రమాదం నవీన్ కెరీర్‌కు పెద్ద బ్రేక్ ఇచ్చింది. చేతికి, వెన్నెముకకు తీవ్ర గాయాలవడంతో దాదాపు ఏడాది పాటు షూటింగ్‌కు దూరమయ్యాడు. దీర్ఘ విరామం తరువాత ఈ సినిమాను పూర్తిచేసిన నవీన్ ఇప్పుడు సంక్రాంతి 2026 కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు.సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ 'అనగనగా ఒక రాజు' ఫస్ట్ సాంగ్‌ను విడుదల చేశారు. నాది సైలెంట్ బ్యాచ్ కాదు.. అల్లరి చేసే బ్యాచ్. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అది మీ అందరి సపోర్ట్ వల్లే. ఏజెంట్ ఆత్రేయ, జాతిరత్నాలు, మిస్ శెట్టి సినిమాలను మీరు ఎంత ప్రేమించారో తెలుసు. ఈ సినిమాను కూడా అదే ప్రేమతో ఆదరిస్తారని నమ్మకం ఉందన్నాడు. ఈ సినిమాలో పాట పాడాను, డ్యాన్స్ చేశాను? ఈ సారి పండగకి మీ ముందుకు రానున్నాను' అని అన్నారు. నవీన్ భావోద్వేగ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు 'అనగనగా ఒక రాజు'పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రమాదాన్ని జయించి, ప్రేక్షకుల ముందుకు వస్తున్న నవీన్ ప్రయాణం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# వారణాసిలో చిన్నప్పటి మహేశ్‌గా దర్శన్



దర్శక దిగ్గజం రాజామౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు నటిస్తున్న భారీ చిత్రం వారణాసి. ఈ పాన్ వరల్డ్ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల రిలీజ్ చేసిన 'రుద్ర' గ్లిమ్స్ కు భారీ స్పందన లభించింది. ప్రస్తుతం హైదరాబాద్ లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో షూట్ జరుగుతోంది. ఈ షెడ్యూల్ లో మహేశ్ చిన్నప్పటి సన్నివేశాలు తీస్తున్నారు. అయితే మహేశ్ చిన్నప్పటి రోల్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ కొడుకు భార్గవ్ నటిస్తున్నాడని రెండు రోజుల నుండి సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేశాయి. ఈ విషయమై వారణాసి టీమ్ ను సంప్రదించగా అసలు అటువంటిది ఏమి లేదని తేల్చి చెప్పారు. ఎన్టీఆర్ కొడుకు నటిస్తున్నాడనేది పక్కా ఫేక్ న్యూస్. ఇక్కడే మరో ఆసక్తికర విషయం తెలిసింది. సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు ప్రిన్స్ మహేశ్ బాబు బావ హీరో సుధీర్ బాబు కుమారుడు దర్శన్ నటిస్తున్నాడు. అందుకు సంబంధించి షూట్ కూడా చేస్తున్నారు. సుధీర్ బాబు చిన్న కొడుకు దర్శన్ ఆల్రెడీ అడివి శేష్ గూఢచారి, మహేష్ బాబు సర్కారు వారి పాట సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా కనిపించాడు. దర్శన్ నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. అలాగే హను రాఘవపూడి డైరెక్షన్ లో వస్తున్న ఫౌజీలోను ప్రభాస్ చిన్నప్పటి రోల్ లో దర్శన్ నటించబోతున్నాడు.

# గందరగోళంగా విష్ణు విశాల్ ఆర్యన్



తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన కథానాయకుడు విష్ణు విశాల్ కీలక పాత్రలో నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ 'ఆర్యన్'. ఇప్పుడు ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఓ న్యూస్ ఛానల్‌లో జరుగుతున్న ఇంటర్వ్యూకు ప్రేక్షకుడిలా హాజరవుతాడు ఆత్రేయ (సెల్వ రాఘవన్). నయన (శ్రద్ధా శ్రీనాథ్) వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఆ షోకు వచ్చిన సెలబ్రిటీని కాలిపై తుపాకీతో కాల్చి లైవ్‌లో యావత్ ప్రపంచానికి ఓ సందేశాన్ని ఇస్తాడు. తాను ఒక రచయితనని, జీవితంలో ఫెయిల్ అయినట్లు చెబుతాడు. వచ్చే ఐదు రోజుల్లో ఐదు హత్యలు చేస్తానని.. గంట ముందు వారి పేరు చెబుతానని, ఈ హత్యలను ఎవరూ ఆపలేరని చెబుతూ తనని తాను కాల్చుకుని చనిపోతాడు. దీంతో పోలీస్‌శాఖ ఈ కేసును సీరియస్‌గా తీసుకుంటుంది. ఆత్రేయ చెప్పిన వాళ్ళెవరో కనిపెట్టి కాపాడాలని భావిస్తుంది. పనిలో నిజాయతీగా ఉండే పోలీస్ ఆఫీసర్ నంది (విష్ణు విశాల్)కి ఈ బాధ్యతలు అప్పగిస్తుంది. చనిపోయిన తర్వాత కూడా ఆత్రేయ వరుస హత్యలు ఎలా చేశాడు? వాటిని అడ్డుకునేందుకు నంది అతడి టీమ్ ఏం చేసింది? ఈ క్రమంలో వాళ్లకు ఎదురైన సవాళ్లు ఏంటి? కేవలం ఐదుగురినే హత్య చేయడంలో ఆంతర్యం ఏంటన్నది కథ. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులను విశేషంగా అలరిస్తాయి మర్డర్ మిస్టరీ థ్రిల్లర్స్. హత్యలను ఛేదించడానికి లేదా సీరియల్ కిల్లర్ నుంచి వాటిని తప్పించడానికి కథానాయకుడు చేసే సాహసాలు, వేసే ఎత్తులు, పైఎత్తులు అన్నీ అలరిస్తాయి. 'ఆర్యన్' విషయంలో దర్శకుడు కొంతవరకూ సఫలం అయ్యారు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా 'ఆర్యన్'ను ఆరంభించిన తీరు మెప్పిస్తుంది. అసలు చనిపోయిన వ్యక్తి మిగిలిన నలుగురిని ఎలా చంపుతాడా? అన్న ఆసక్తి సినిమా చూసే ప్రేక్షకుడిలో కలుగుతుంది. అదే సినిమా చూసేలా ప్రేక్షకుడిని సమాయత్తం చేస్తుంది.ఆత్రేయ సవాల్‌ను స్వీకరిస్తూ పోలీసులు నందిని రంగంలోకి దింపడం వెంటనే అతడు ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టడంతో కథ, కథనాలు మరింత ఆసక్తికరంగా నడుస్తాయి. ఆ తర్వాత హత్యకు గురయ్యే వ్యక్తుల వివరాలు వెల్లడించేందుకు ఆత్రేయ ఎంచుకున్న మార్గం, వాడుకున్న టెక్నాలజీ పోలీసులతో పాటు ప్రేక్షకుడినీ థ్రిల్‌కు గురిచేస్తుంది. ఈ పోలీసులు సాగించే ఇన్వెస్టిగేషన్ మాత్రం రొటీన్ ఫార్మాట్‌లో ఉంటుంది. చివరిగా పోలీస్ ఆఫీసర్ నంది పేరును ఆత్రేయ ప్రస్తావించడంతో కథ ఒక్కసారిగా ఆసక్తికరంగా మారుతుంది. దర్శకుడు ఎంచుకున్న ఆ పాయింట్, దాన్ని విష్ణు విశాల్ అంగీకరించడం ఏంటో ఎవరికీ అర్థం కాదు. కొత్తదనం ఉండాలి కానీ, మరీ ఇంత కొత్తగా ఉంటే కష్టమే.



# రివాల్వార్ రీటాగా వచ్చిన కీర్తి సురేశ్

ఓ వైపు కథానాయికగా కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే.. మ-రోవైపు నాయికా ప్రాధాన్య చిత్రాలతోనూ జోరు చూపించే ప్రయత్నం చేస్తోంది కీర్తి సురేశ్. ఇప్పుడామె నుంచి వచ్చిన యాక్షన్ సినిమా 'రివాల్వర్ రీటా'. పాండిచ్చేరిని అడ్డాగా చేసుకుని ఓ నేర సామ్రాజ్యాన్ని సృష్టిస్తాడు డాన్ డ్రాకులా పాండ్యన్ (సూపర్ సుబ్బరాయన్). అతన్ని ఎలాగైనా హత్య చేసి తన సోదరుడి చావుకు ప్రతీకారం తీర్చుకోవాలని నర్సింహారెడ్డి (అజయ్ ఘోష్) ఓ ముఠాతో రూ.5 కోట్లకి ఒప్పందం కుదుర్చుకుంటాడు. దీనిలో భాగంగా పాండ్యన్‌ను హనీట్రాప్ చేసి చంపేందుకు ప్రణాళిక రచించగా.. అతను డ్రగ్స్ మత్తులో ఓ ఇంటికి వెళ్లబోయి పొరపాటున పక్క వీధిలో ఉన్న రీటా (కీర్తి సురేశ్) ఇంటికి వెళ్తాడు. అక్కడ అనుకోకుండా జరిగిన గొడవలో రీటా తల్లి (రాధికా శరత్ కుమార్) కొట్టిన దెబ్బకు పాండ్యన్ అక్కడిక్కడే ప్రాణాలు విడుస్తాడు. మరి ఆ తర్వాత ఏమైంది? డ్రాకులా పాండ్యన్ హత్య వల్ల రీటా కుటుంబం ఎలాంటి చిక్కుల్లో పడింది? పాండ్యన్‌ను హత్య చేసి రూ.5కోట్లు కొట్టేయాలనుకున్న మార్టిన్ ముఠా వల్ల రీటాకి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? తన తండ్రి జాడ వెతుక్కుంటూ వేట మొదలు పెట్టిన బాబీ పాండ్యన్ (సునీల్)కి రీటా కుటుంబం చేసిన పని గురించి తెలిసిందా? లేదా? అన్నది చిత్ర కథ. ఇది పగ, ప్రతీకారాలతో ముడిపడి ఉన్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్. కర్మ ఎవరినీ విడిచి పెట్టదు.. దాని ఫలితాన్ని అనుభవించక తప్పదనే కోణంలో సాగుతుంది. కథానాయిక కుటుంబంలో జరిగిన ఓ అన్యాయానికి కాలం కర్మ రూపంలో ఎలా బదులు తీర్చుకునే అవకాశమిచ్చిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది. లైన్‌గా చూసినప్పుడు ఈ కథ ఆసక్తిరేకెత్తించేలాగే ఉన్నా.. దాన్ని తెరపై ఆవిష్కరించిన విధానం ఏమాత్రం మెప్పించదు. ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌లో ఇటు నవ్వులు.. అటు థ్రిల్ ఏదీ సరిగ్గా పండలేదు. కథా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ సినిమాను మొదలు పెట్టిన దర్శకుడు.. డ్రాకులా పాండ్యన్ ప్రాణాలు కోల్పోవడంతో కీలక మలుపు తిప్పాడు. ఇక అక్కడి నుంచి ఇంట్లో శవాన్ని మాయం చేసేందుకు ఇటు రీటా కుటుంబం పడే పాట్లు.. అటు ఆ శవాన్ని దక్కించుకునేందుకు మార్టిన్ గ్యాంగ్ చేసే ప్రయత్నాలతో కథ ముందుకు సాగుతుంది.రీటా పాత్రలో కీర్తి సురేశ్ తెరపై అందంగా కనిపించింది. నటిగా ఇది ఆమెకు సవాల్ విసిరే పాత్రేమీ కాదు. సినిమా మొత్తం దాదాపు ఒకే ఎక్స్‌ప్రెషన్‌లో కనిపిస్తుంది. ద్వితీ-యార్థంలో తనలోని యాక్షన్ కోణాన్ని రుచి చూపించింది. తల్లి పాత్రలో రాధికా శరత్ కుమార్ నటన అక్కడక్కడా నవ్వులు పూయించింది. ప్రతినాయకుడిగా బాబీ పాండ్యన్ పాత్రలో సునీల్ ఆద్యంతం సీరియస్ లుక్‌లోనే కనిపించారు. తన ఆహార్యం కొత్తగా ఉంది. జాన్ విజయ్, సూపర్ సుబ్బరాయన్, అజయ్ ఘోష్ తదితరుల పాత్రలు పరిధి మేరకు ఉంటాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఈవీఎం తనిఖీ కోసం ఏ ఒక్క దరఖాస్తు రాలేదని సీఈఓ స్పష్టం

● ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ సీ. సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 28( సమయం న్యూస్) :**61-జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల్లో వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు) కాలిపోయిన మెమరీ / మైక్రో కంట్రోలర్‌ను తనిఖీ చేసి ధృవీకరించాలంటూ అర్హులైన అభ్యర్థుల నుంచి ఏ ఒక్క వ్రాతపూర్వక దరఖాస్తు కూడా అందలేదని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ సీ. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం, అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి తరువాత రెండో లేదా మూడో స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు కోరినపక్షంలో, మొత్తం ఈవీఎంలలో 5 శాతం వరకు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ మరియు వివీపాట్‌లను తయారీ సంస్థల ఇంజినీర్ల బృందం ద్వారా తనిఖీ చేసి ధృవీకరించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఇందుకోసం ఫలితాల తేదీ నుంచి ఏడు రోజులలోపు వ్రాతపూర్వకంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వివరించారు.ఫలితాలు ప్రకటించిన 14.11.2025 నుంచి 21.11.2025 వరకు ఉన్న నిర్ణీత గడువు సమయంలో జిల్లా ఎన్నికల అధికారి / రిటర్నింగ్ అధికారికి ఎలాంటి దరఖాస్తులు రాకపోవడం స్పష్టమైందన్నారు.ఎన్నికల నిర్వహణ మొత్తం భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, విధి నియమాలు మరియు భద్రతా ప్రమాణాల ప్రకారమే పూర్తిస్థాయిలో పారదర్శకంగా సాగిందని, ఈ వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడేలా అన్ని చర్యలు తీసుకున్నామని సీఈఓ పేర్కొన్నారు.

## నిర్ణీత గడువులోగా వచ్చిన నామినేషన్లు మాత్రమే స్వీకరించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**దండేపల్లి నవంబర్ 28( సమయం న్యూస్).:** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు సమర్పించే నామినేషన్లను నిర్ణీత గడువులోగా మాత్రమే స్వీకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ, ముత్యంపేట, రెబ్బెనపల్లి, చెల్కగూడ గ్రామాలకు కొర్విచెల్మ గ్రామపంచాయతీ, నెల్కివెంకటాపూర్, వందూర్ గూడ, చింతపల్లి, తానిమడుగు గ్రామాలకు నెల్కివెంకటాపూర్ గ్రామపంచాయతీ, ద్వారక, కొండాపూర్, ధర్మారావుపేట గ్రామాలకు ద్వారక గ్రామపంచాయతీ, మ్యాదరిపేట, మామిడిపల్లి, కొత్త మామిడిపల్లి గ్రామాలకు మ్యాదరిపేట గ్రామపంచాయతీ, దండేపల్లి, కర్ణపేట, నర్సాపూర్ గ్రామాలకు దండేపల్లి గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు చేపట్టిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 29వ తేదీన సాయంత్రం 5 గంటల లోగా నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని, 5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేయాలని తెలిపారు. నామినేషన్ కేంద్రంలో రద్దీ లేకుండా నామినేషన్ స్వీకరణ ప్రక్రియ నిబంధనలకు లోబడి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో 3 విడతలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా మొదటి విడతలో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని, నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించకూడదని, నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం మండలంలోని ద్వారక గ్రామంలో కొనసాగుతున్న షెడ్యూల్డ్ తెగల బాలుర సంక్షేమ వసతిగృహం నిర్మాణ పనులను సందర్శించి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంతకుముందు లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరి ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు టార్పాలిన్లు, గోనె సంచులు, తేమ యంత్రాలు, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. దొడ్డు రకం, సన్న రకం ధాన్యాలను వేరువేరుగా కొనుగోలు చేయాలని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు సమయంలో రైతుల వివరాలు, ధాన్యం వివరాలను సేకరించి ట్యాబ్ లలో నమోదు చేయాలని, సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## మహబూబాద్ జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్ గుర్తింపు ప్రక్రియ పూర్తి ప్రజల నుండి అభ్యంతరాలు కోరుట

**మహబూబాబాద్, నవంబర్.28( సమయం న్యూస్) :** భారత ప్రభుత్వం జారీ చేసిన మాన్యువల్ స్కావెంజర్స్ యొక్క మార్గదర్శకాలు తేది: 01-02-2024 అనుసరించి మాన్యువల్ స్కావెంజర్స్ రిహాబిలిటేషన్ చట్టం - 2013 ప్రకారం గౌరవ జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ మహబూబాబాద్ గారు జిల్లా స్థాయి మాన్యువల్ స్కావెంజర్స్ సర్వే కమిటీలను మరియు డివిజన్ స్థాయి సర్వే కమిటీలను ఏర్పాటు చేయనైనది, అట్టి సర్వే కమిటీల ద్వారా మహబూబాబాద్ జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్ పరిశీలన చేపట్టడం జరిగింది అందులో భాగంగా ప్రతి (గామ పంచాయతీ మరియు మున్సిపాలిటీల యొక్క నోటీస్ బోర్డుపై మరియు అన్ని కార్యాలయ నోటీసు బోర్డులపై మాన్యువల్ స్కావెంజర్ గుర్తింపు సంబంధించిన ప్రకటన ఉంచనైనది మరియు మాన్యువల్ స్కావెంజర్స్ గుర్తించినచో తేదీ.04.11.2025 లోపు సంబంధిత కార్యాలయమునకు తెలియజేయాల్సిందిగా తెలియజేయునైనది, కానీ మ్యానువల్ స్కావెంజర్స్ ఉన్నట్లు నమోదు కాలేదు మరియు మహబూబాబాద్ జిల్లాలోని అన్ని (గామ పంచాయతీ ల పరిధిలోని, మరియు (5) మునిసిపాలిటిలలో మాన్యువల్ స్కావెంజర్స్ ఎవరు లేరని సంబందిత సర్వే టీం ల నివేదిక ద్వారా తెలియవచ్చింది. ఇట్టి విషయమంలో ఇంకనూ తెలియజేయునది, ఏమనగా మాన్యువల్ స్కావెంజర్స్ ఏ (గామములో మరియు మునిసిపాలిటీలలోనైనా ఉన్నట్లు ఎవరైన గుర్తించిన యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజులలోపు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, రూమ్ నెంబర్-17 (2వ అంతస్తు) మహబూబాబాద్ నందు తెలుపగలరు. గడువు ముగిసిన తేదీలోపు ఎలాంటి అభ్యంతరాలు నమోదు కానిచో మహబూబాబాద్ జిల్లాను మాన్యువల్ స్కావెంజర్స్ (ఫ్రీ గా ప్రకటించబడునని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. శ్రీనివాస రావు నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రజావాణి రద్దు.... జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

**సంగారెడ్డి, నవంబర్ 28( సమయం న్యూస్).::** గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని ఆమె కోరారు.

# కేబీఆర్ వద్ద పార్కింగ్ కష్టాలకు ఇక శాశ్వత తెర

- ఈ నెల 29 వ తేదీ నుంచి కే బి ఆర్ పార్క్ వద్ద అందుబాటులోకి రానున్న
- ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్ వ్యవస్థ
- నగరంలో ఇదే మొదటి ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్



**హైదరాబాద్, నవంబర్ 28( సమయం న్యూస్).:** హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద పార్కింగ్ కష్టాలకు ఇక నుంచి శాశ్వతంగా తెర పడనుంది.నిత్యం రద్దీగా ఉండే జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద పార్కింగ్ అనేది తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ప్రత్యేకించి ఉదయం, సాయంత్రం పూట పార్క్‌కు, పార్క్‌లో వాకింగ్‌కు వచ్చేవారు తీవ్ర పార్కింగ్ సమస్యను ఎదుర్కొంటున్నారు. మరోవైపు రోడ్డుకు ఒకవైపున వరుసగా వాహనాలు పార్క్ చేయడంతో వాహనాల రాకపోకలపై ప్రభావం పడుతున్నది. ఈ నేపథ్యంలో ఆ కష్టాలను తొలగించడంపై జీహెచ్‌ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టింది.

ఇందులో భాగంగానే మల్టీ లెవల్ స్మార్ట్ కార్ పార్కింగ్ పచ్చజెండా ఊపింది...ఇక్కడ 405 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జీహెచ్‌ఎంసీ అధ్వర్యంలో నవ నిర్మాణ్ అసోసియేట్స్ మల్టీలెవెల్ పార్కింగ్ వ్యవస్థను నిర్మించింది.

ఇందులో 72 ఈక్విలెంట్ కార్ స్పేసెస్ ( ఉంటాయి. మొత్తం పార్కింగ్ విస్తీర్ణంలో 20 శాతాన్ని ద్విచక్రవాహనాల కోసం కేటాయిస్తారు. ఈ ప్రాజెక్ట్ ను నవ నిర్మాణ్ అసోసియేట్స్ డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫం పీపీపీ మోడల్‌లో నిర్మించి అమలు చేస్తుంది.

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ ఇక్కడ పార్క్ చేసుకోవచ్చు. యంత్రాలు, స్మార్ట్ కార్డ్‌ల ద్వారా పార్కింగ్ టికెట్‌లు జారీ చేస్తారు. ముందగానే పార్కింగ్ బుక్ చేసుకునేందుకు, నావిగేషన్, ఇతర సర్వీసుల కోసం ఒక మొబైల్ యాప్‌ను కూడా తీసుకురానున్నారు. పార్కింగ్ సజావుగా సాగేందుకు డిజిటల్ సర్వీసుల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తారు.

ఇప్పటికే పూరైన మల్టీ లెవెల్ స్మార్త్ పార్కింగ్ ఇటీవలే ట్రయల్ రన్ కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంది.

జీహెచ్‌ఎంసీ పరిధిలో పబ్లిక్ ప్లేస్ లో ఏర్పాటు చేసిన మొట్టమొదటిమల్టీ లెవల్ స్మార్ట్ కార్ పార్కింగ్ గా ప్రత్యేకత కలిగిన దీనిని ఈ నెల 29 వ తేదీన జీహెచ్‌ఎంసీ ప్రారంభించనుంది.మల్టీ లెవల్ స్మార్ట్ కార్ పార్కింగ్ అందుబాటులోకి వస్తేకేబీఆర్ పార్క్ పరిసరాల్లో పెరుగుతున్న రోడ్ సైడ్ పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. తక్కువ స్థలంలో ఎక్కువ వాహనాలను నిలిపే వీలుండటంతో పాటు ట్రాఫిక్ సజావుగా స్మూత్ గా సాగేందుకు , పాదచారుల భద్రతకు ఇది తోడ్పడనుంది.

ఈ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ప్రత్యేకతలు ఇవే!

కాంపాక్ట్ డిజైన్: నిలువు రోటరీ సిస్టమ్ ద్వారా భూమి వినియోగం తగ్గింపు

పార్కింగ్ సామర్థ్యం: 72 కార్లు ం ద్వి చక్ర వాహనాల కోసం ప్రత్యేక స్థలాలు

స్మార్ట్ యాక్సెస్: RFID ఆధారిత ప్రవేశం-నిష్క్రమణ

ఈవీ ఛార్జింగ్: గ్రీన్ మొబిలిటీకి తోడ్పాటు

స్మార్ట్ భద్రత: సెన్సర్లు, లాకింగ్ వ్యవస్థలు, సీసీటీవీ పర్యవేక్షణ పని వేళలు: ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరక

# గ్రామపంచాయతీ ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు ఉండాలి


- జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు
- గ్రామపంచాయతీ ఎన్నికల పై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్ ఓ గణేష్, డిపిఓ లక్ష్మీ రమాకాంత్ లతో జిల్లా ఎన్నికల పరిశీలకులు శివ కుమార్ నాయుడు, వ్యయ పరిశీలకులు దేవేందర్ సమీక్ష
- కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, అధికారులతో సమావేశం
- ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు కు కలెక్టరేట్ వద్ద మొక్కలను అందించి స్వాగతం పలికిన కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి



**హనుమకొండ నవంబర్28 ( సమయం న్యూస్) :** జిల్లా లో గ్రామపంచాయతీ ఎన్నికలను సాఫీగా నిర్వహి ంచేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు ఉండాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు, ఐఏఎస్ అధికారి కిల్లు శివకుమార్ నాయుడు అన్నారు. గురువారం సాయంత్రం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి జిల్లా ఎన్నికల పరిశీలకులు, కమిషనర్, ఆర్ అండ్ ఆర్, ల్యాండ్ అక్విజెషన్, ఐ క్యాడ్ శ్రీ కిళ్ళు శివకుమార్ నాయుడు ఐ ఏ ఎస్ విచ్చేయగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మొక్కలను అందించి స్వాగతం పలికారు. కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియపై హనుమకొండ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డి ఆర్ ఓ గణేష్ , జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి రమాకాంత్ లతో జిల్లా ఎన్నికల పరిశీలకులు, వ్యయ పరిశీలకులు దేవందర్ సమావేశమయ్యారు. నామినేషన్ కేంద్రాలలో ఏర్పాట్లు, నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పాటించాల్సిన నియమ నిబంధనలు, ఎన్నికల సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కగా పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లాలో మూడు దశల్లో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్ల పూర్తి వివరాలు అందించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, బ్యాలట్ బాక్సు, రవాణా, జోన్లు, రూట్, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు, ప్రహరీ, సిబ్బంది వంటి అన్ని అంశాల్లో పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు.ఎన్నికలు పూర్తిస్థాయి పారదర్శకతతో జరగేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

# ఎన్నికల ప్రవర్తన నియమావలి పక్కాగా అమలు కావాలి

- గ్రామపంచాయతీ ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు ఉండాలి
- జిల్లా ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్ IFS
- గ్రామపంచాయతీ ఎన్నికల పై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్,డీసీపీ రాజమహేంద్ర నాయక్ లతో కలిసి జిల్లా ఎన్నికల పరిశీలకులు నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం
- ముందుగా...ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్ కు మొక్కలను అందించి స్వాగతం పలికిన కలెక్టర్ , అదనపు కలెక్టర్



**జనగాం నవంబర్28( సమయం న్యూస్) :** జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు ఉండాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు, రవి కిరణ్ IFS అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి రవి కిరణ్ IFSఎన్నికల పరిశీలకులు, కమిషనర్, ESD, మీసేవ విచ్చేసి... కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, డీసీపీ, నోడల్ అధికారులతో సమావేశామయ్యారు ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ...జిల్లాలో మూడు దశల్లో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలు,బ్యాలట్ బాక్సు, రవాణా, జోన్లు, రూట్, అన్ని అంశాల్లో పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు.ఎన్నికలు పూర్తిస్థాయి పారదర్శకతతో జరగేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

అనంతరం అబ్జర్వర్ మాట్లాడుతూ..... ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కగా పాటించాలని సూచించారు.ఎన్నికల విధులు నిర్వహించే ప్రతీ ఒక్కరు శిక్షణ పూర్తి చేసుకొని ఉండాలన్నారు ఎన్నికల నిర్వహణ లో ఎలాంటి సందేహాలు ఉన్న వెంటనే నివృత్తి చేసుకువాలని సూచించారు ఈ కార్యక్రమం లో జడ్పీ సీఈఓ మాధురి షా, ఇంచార్జి డీపీవో, డి ఆర్డీ ఓ వసంత, మ్యాన్ పవర్ మేనేజ్మెంట్, బ్యాలెట్ బాక్స్, మెటీరియల్, ట్రాన్స్పోర్ట్, తదితర అంశాల నోడల్ అధికారులు పాల్గొన్నారు అనంతరం రఘునాథ్ పల్లి, నీడిగొండ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని కలెక్టర్ తో కలిసి అబ్జార్వర్ సందర్శించి నామినేషన్ ప్రక్రియ ను పరిశీలించారుగ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా సజావుగా నిర్వహించాలన్నారుఆయా పంచాయతీల కు ఖరారు చేసిన రిజర్వేషన్ల ప్రకారం సంబంధిత వర్గాల అభ్యర్థుల నుంచి నామినేషన్లు తీసుకోవాలన్నారు.గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచు, వార్డు సభ్యులు పదవులకు పోటీ చేయు అభ్యర్థులు తమ దరఖాస్తుకు జతపరచాల్సిన వయసు, కుల, ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను నిబంధనల ప్రకారం స్వీకరించాలన్నారు.